


# విజయభాను




విశాఖపట్నం, శుక్రవారం 29-06-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 276 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## అమ్మ దయ ఉంటేచాలు

- దుర్గమ్మకు బంగారు ముక్కుపుడక సమర్పించిన టి-సీఎం కేసీఆర్
- పూర్ణకుంభంతో మేళతాళాల మధ్య స్వాగతం
- పాల్గొన్న మంత్రులు దేవినేని, ఇంద్రకరణ్ రెడ్డి
- కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి దర్శనం





విజయవాడ: ఇంద్రకీలాద్రిపై వెలసిన విజయవాడ కనకదుర్గ అమ్మవారిని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి చేయించిన ముక్కుపుడకను నెత్తిన పెట్టుకుని మేళతాళాల మధ్య కేసీఆర్ ఆలయంలోనికి ప్రవేశించారు.

అంతకుముందు బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో కేసీఆర్ గన్నవరం విమానాశ్రయం చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి కేసీఆర్ నేరుగా ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కేసీఆర్ ముక్కపుడకను కనకదుర్గ అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు కేసీఆర్ గోత్ర నామాలతో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేసీఆర్ సతీమణి, కోడలు, మనవలు, పలువురు బంధువులు, తెలంగాణ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేసీఆర్‌ను చూసేందుకు భక్తులు ఎగబడ్డారు. ఈ పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ప్రత్యామ్నాయ పంటలపై
# దృష్టిసారించాలి



- టెక్నాలజీని విస్తృతంగా వాడండి
- చంద్రన్న రైతు బీమా పథకం ప్రారంభం
- ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం వద్ద రైతుల ప్రదర్శన
- ఎరువులు, విత్తనాల కొరతను అధిగమించాం
- వంశధార, నాగావళిని అనుసంధానం చేస్తాం
- ఏరువాక పూర్ణిమను ప్రారంభించిన సీఎం

శ్రీకాకుళం: జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు... ఆమదాలవలస మండలం జగ్గుశాస్త్రులపేటలోని ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం వద్ద చంద్రన్న రైతు బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఈనెల నుంచి రైతు బీమాను ప్రారంభిస్తామన్నారు. ప్రమాదవశాత్తు చనిపోతే రూ.5 లక్షల బీమా, పాక్షిక అంగవైకల్యానికి రూ.2 లక్షలు ఇస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. రైతుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తామన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్ట తరువాయి 2లో..



## ఎస్పీ, బీఎస్పీలపై మోదీ విమర్శల దాడి

- అధికారం కోసం కుయుక్తులు
- సమిష్టిగా పోటీ చేసి గట్టి షాక్ ఇవ్వాలి
- సంత్ కబీర్ నగర్ జిల్లాలో మాట్లాడుతున్న ప్రధాని న.మో.

లక్నో : ప్రధాని నరేంద్ర మోదీ యూపీ పర్యటనలో ఎస్పీ, బీఎస్పీలను టార్గెట్ చేస్తూ విమర్శల దాడి పెంచారు. సమాజ్‌వాద్, బహుజన్‌ల గురించి మాట్లాడే వారు అధికారం కోసం కుయుక్తులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. యూపీలో ఈ రెండు పార్టీలు అధికారం కోసమే ఏకమయ్యాయని ఆరోపించారు. ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పోరాడిన ఈ పార్టీలు ఇప్పుడు రాజకీయ తరువాయి 2లో..



## ప్రజా సమస్యలపై
## పోరాటమే జనసేన లక్ష్యం

- 2019లో ఖచ్చితంగా అధికారంలోకి వచ్చి తీరుతుంది
- ఇప్పటికే పవన్‌ను చూసి పార్టీలోకి మారిన శ్రేణులు
- జనసేన పార్టీలో చేరిన మాజీ క్రికెటర్ వేణుగోపాలరావు

విశాఖపట్నం: భారత క్రికెట్ జట్టు మాజీ ఆటగాడు వేణుగోపాలరావు గురువారం జనసేన పార్టీలో చేరారు. విశాఖలో జనసేన అధినేత పవన్ సమక్షంలో ఆయన పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. పవన్ అభిమానులు సైతం భారీ సంఖ్యలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. జనసేన పార్టీ సుదీర్ఘ కాలం ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యంగా పని చేస్తోందని అన్నారు. 2019లో జనసేన కచ్చితంగా అధికారంలోకి వచ్చి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. పోరాటయాత్రలో భాగంగా పవన్ విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. భారత్ తరపున 2005లో ఆరంగ్రేటం చేసిన వేణుగోపాలరావు శ్రీలంకతో తొలి వన్డే, 2006లో వెస్టిండీస్‌పై చివరి వన్డే ఆడారు. 16 మ్యాచ్‌ల్లో 218 పరుగులు చేశారు.

## మాజీ ప్రధాని పీవీది ప్రత్యేక శైలి

పీవీ నరసింహరావుకి ఘన నివాళి

జ్ఞాన భూమిలో ఆయన సమాధి వద్ద పుష్పాంజలి



హైదరాబాద్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు బహుభాషా కోవిదుడు, నూతన ఆర్థిక సంస్కరణలను దేశానికి పరిచయం చేసిన ఆర్థిక వేత్త అని తెలంగాణ హోం మంత్రి నాయిని నరసింహారెడ్డి కొనియాడారు. పీవీ జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీవీ జ్ఞానభూమిలో ఆయన సమాధికి నాయిని పుష్పాంజలి ఘటించారు. మైనారిటీ ప్రభుత్వాన్ని పూర్తికాలం నడిపిన ఘనత పీవీదేనని ఆయన కొనియాడారు. పీవీ మరణానంతరం కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు సమంజసం కాదన్నారు.

**తెదేపా ఎంపీల నివాళి**

పీవీ నరసింహారావుకు తెలుగుదేశం ఎంపీలు తరువాయి 2లో..




# వైద్య సేవలు భేష్

- కెజిహెచ్‌ను కలక్టర్ ఆకస్మిక తనిఖీ
- రోగులకు అందజేస్తున్న వైద్య సేవలపై ఆరా
- 220 డెంగ్యూ కేసుల నిర్ధారణ గుర్తింపు
- ప్రైవేటు ఆస్పత్రి ప్రతినిధులతో సమీక్ష
- విశాఖ జిల్లా కలక్టర్ ప్రవీణ్ కుమార్



విశాఖపట్నంః గురువారం విశాఖ జిల్లా కలక్టర్ ప్రవీణ్ కుమార్ కెజిహెచ్‌ను ఆకస్మిక సందర్శన చేసి ప్రభుత్వ వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అన్ని వార్డులు కలియతిరిగారు. తొలుత కెజిహెచ్ సూపరింటెండెంట్ తరువాయి 2లో..



# ఆక్రమణలు తొలగింపు

భీమునిపట్నం: తగరపువలస మెయిన్ రోడ్ , సంత వద్ద నిత్యం రోడ్ మీద వెళ్ళా లంటే ఇబ్బంది పడే వారు ఇరువైపులా తోపుడు బళ్లు రోడ్ లపైన పెట్టడం ఆటోలు రోడ్‌కి అడ్డంగా పెట్టడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తేవి వాటిని పరిష్కరించే క్రమంలో రోడ్డు పైన వున్న ఆక్రమణలను గురువారం ఉదయం జోనల్ కమిషనర్ పి.దుర్గాప్రసాద్ సిబ్బందితో తొలగించారు. రోడ్ మార్జిన్‌ను మార్కింగ్ చేశారు. ఇక మీదట ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని భీమిలి జోనల్ కమీషనర్ షాపు యజమానులను హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, శానిటరీ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.అలాగే భీమిలి తోటవీధిలో డెంగ్యూ ,మలేరియా వంటి వ్యాధులు ప్రభలకుండా వుండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా వుంచు కోవాలని ,ఎక్కడా నీటి నిల్వలు ఉంచకుండా చూసుకోవాలని జోనల్ కమిషనర్ పి.దుర్గాప్రసాద్ సూచించారు . ఈ సందర్భంగా తోటవీది లో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమం లో శానిటరీ ఇన్ స్పెక్టర్ రవికుమార్ ,సిబ్బంది పాల్గొన్నారు.

# వాహన తనిఖీల్లో 900 గ్రాముల రంగురాళ్లు స్వాధీనం

కొయ్యూరు: విశాఖ ఏజెన్సీ చింతపల్లి నుండి మైదాన ప్రాంతాలకు గుట్టుగా కారులో అక్రమంగా తరలిస్తున్న రంగురాళ్లను కొయ్యూరు ఇన్‌చార్జ్ ఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. బుధవారం సాయంత్రం కాకరపాడు కూడలి వద్ద వాహనాలు తనిఖీ జరుపుతుండగా ముందస్తు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. చింతపల్లి నుండి వస్తున్న ఏపి31బిపి 4205 నెంబరు గల కారులో 900 గ్రాముల రంగురాళ్లను గుర్తించారు. అలాగే వ్యాపార కార్యకలాపాలకు వీలుగా సమకూర్చున్న రూ.2.74నగదు స్వాదీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి అక్రమ రవాణాదారులుగా గుర్తించిన రాజమండ్రికి చెందిన దినరాలి రామకృష్ణ, బక్కా వెంకటేశ్వరరావు, జికెవీధి మండలం ఈదులబందకు చెందిన కొర్ర రాజుబాబు, నల్లబెల్లికి చెందిన వంతల చంద్రరావు, తూర్పుగోదావరి జిల్లా అడ్డగీతల చెందిన వి.వెంకటరమణ, వి.సురేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం పరచుకొని నిందితులను అటవీ చట్ట ఉల్లంఘన, ఎంఎం రెగ్యులేషన్ యాక్టులపై అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

# జులై 4 నుంచి ఆశవర్కర్ల సమ్మె

రావికమతం : సమస్యల పరిష్కారాలు, జీతాలు పెంచాలని కోరుతూ జులై 4వ తేదీ నుంచి ఆశ వర్కరు సమ్మెలోకి దిగుతున్నట్లు ఆశవర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి వజ్రపు సత్యవతి తెలిపారు. ఆశవర్కర్ల పారితోషికం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తమతో వెట్టిచాకిరి చేయించుకుంటుందన్నారు. ఏప్రిల్ 16న చేపట్టిన చర్చలు చేయగా, మే నెలాఖరు నాటికి సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయినా ఇంత వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. దీంతో జులై 4 నుంచి 9 వరకు సమ్మె చేయాలన్న నిర్ణయం చేశామన్నారు. 4న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా, 5న మండలకేంద్రంలో నిరశన, 6న మానవహారం, 7న బిక్షాటన, 8న సర్పంచులకు వినతిపత్రం, 9న ఆర్డీవో కార్యాలయ ముట్టడిలను చేపట్టనున్నట్లు ఆమె చెప్పారు.

# ఐఎఎస్ కావడమే లక్ష్యం

అనకాపల్లి: ఐఎఎస్ అధికారిగా స్థిరపడడమే తమ లక్ష్యమని ఎన్ఐఎ అసిస్టెంట్ కమీషనర్ కొణతాల అచ్చింనాయుడు అన్నారు. గురువారం ఆయన తన స్వగ్రామమైన అనకాపల్లికి విచ్చేసారు. ఈసందర్బంగా తనను కలిసిన విలేకర్లతో మాట్లాడుతూ కష్టపడి చదవి ఉన్నత శిఖరాలను అదిరోహించినట్లు తెలిపారు. అంతేకాకుండా న్యూఢిల్లీలోని, నేషనల్ ఇన్వేష్టిగేషన్ ఏజన్సీలో అసిస్టెంట్ కమీషనర్‌గా ఉద్యోగం చేస్తున్నానన్నారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ కష్టపడితే సాదించలేదని ఏమి లేదన్నారు. చిన్నతనం నుండి, తన తల్లిదండ్రులు బాలకృష్ణ, ఆదిలక్ష్మిలు ఎన్ని కష్టాలున్నా, తనను చదివించారని, 7 వ తరగతి వరకు రోయల్ కాన్వెంట్‌లో, 10 వతరగతి వరకు జెఎల్ కాన్వెంట్‌లో చదివించారని చెప్పారు. అలాగే ఇంటర్మీడియర్ నారాయణ జూనియర్ కాలేజీలోను, డిగ్రీ హిమశేఖర్‌కాలేజీలో, ఎంఎస్‌సి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చదువుకోవడం జరిగిందన్నారు. 2013లో గేట్ పరిక్ష వ్రాసి 38 వ ర్యాంకు సాదించడం జరిగిందన్నారు. అలాగే సిఎస్ఐఆర్ 2013లో హాజరై 42 ర్యాంకు పొందడం జరిగిందన్నారు. 2015లో యూపిఎస్‌సి సివిల్ సర్వీస్ పరిక్షలు వ్రాయడం జరిగిందని చెప్పారు. ఇలా తన ప్రస్థానం కొనసాగిందని వివరించారు. ఈయన బాధ్యతలు స్వీకరించడం పట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేసారు.

# ఘనంగా శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి పండగ

- ఆలయ అభివృద్ధి, నిర్వహణ బాగుంది
- ప్రత్యేక పూజలకు హాజరైన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు







మాధవధారః గ్రేటర్ విశాఖ 39వ వార్డు మాధవధార గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కుంచుమాంబ, కనక మహాలక్ష్మి, కొత్త మహాలక్ష్మి అమ్మవార్ల పండగ మహోత్సవాలలో భాగంగా గురువారం శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించారు. శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ బాధ్యతలను నిర్వర్తిస్తున్న మాజీ కార్పొరేటర్ సనపల సీతారామాంజనేయుల ఆధ్వర్యంలో ఈ పండగను జరుపుకున్నారు. గురువారం ఉదయం నుండి తండోపతండాలుగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మహోత్సవాలకు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణం సర్వాంగ సుందరంగా ఉందని, అమ్మవారి దర్శనానంతరం మనస్సు చాలా ప్రశాంతంగా ఉందని, ఆలయం ఇంకా అభివృద్ధి చెందాలని తాను కోరుకుంటున్నానన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సనపల సీతారామాంజనేయులు కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో ఆయన హయాంలో ఆలయం ఇంత అభివృద్ధికి నోచుకోవడం బహుదా ప్రశంసనీయమని ఆయన కొనియాడారు.
అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో మాధవధార గ్రామ పెద్దలు, మాధవ యువజన సమాజ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చంద్రన్న పెళ్ళికానుక అందజేత



భీమునిపట్నం: తగరపువలస జోన్ బాలాజీ నగర్ కు చెందిన దామోదల మంగ ప్రసన్న కుమార్ లకు తగరపువలస బైపాస్ రోడ్ లో వున్న వెంకటేశ్వర స్వామి గుడిలో మందిరం లో వివాహం చేసుకుంటున్న దంపతులకు చంద్రన్న పెళ్ళికానుక లక్ష రూపాయుల బాండ్ ను తగరపువలస డివిజన్ టీడీపీ అధ్యక్షులు కొప్పల రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ చంద్రన్న పెళ్ళికానుక పేదలకు వరం లాంటి దని అన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ మిత్ర ,టీడీపీ నాయకులు రవ్వ.వెంకటరావు, టి.సూరిబాబు,జే.ఎల్లయ్య,కొప్పల.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చదవండి
చదివించండి
విజయభాను

# హాస్టల్‌లో సదుపాయాలు మెరుగుపర్చాలి




నర్సీపట్నం : మనం గ్రామం మన విశాఖ కార్యక్రమం వేములపూడిలో జరిగింది. నూతనంగా మండలానికి వచ్చిన ప్రత్యేకాధికారి బివి.రమణ మాట్లాడుతూ హాస్టల్‌లో సదుపాయాలు మెరుగుపర్చాలని బిసి బాలికల వసతి గృహ సంక్షేమాధికారి రజనిని హెచ్చరించారు. హాస్టల్ లో వాతావరణం మెరుగుపర్చాలన్నారు. అనంతరం ఎస్సీ బాలుర హాస్టల్‌లోని విద్యార్థులకు పుస్తకాలు, చాపలు, వాటర్ బాటిళ్లుపంపిణీ చేశారు. గ్రామంలో ఇకపై అవసరమైన వన్ని ఒక ప్రణాళిక బద్దంగా రూపొందించి అభివృద్ధి చేయడానికి అధికారలు సన్నద్ధం కావాలన్నారు. ఎంపిపి సుకల రమణమ్మ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌కు అనుగుణంగా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.
ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోళెం నర్సింహమూర్తి, ఎంపిడిఒ రమణబాబు, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు సత్యనారాయణ, నరసింహం, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.





మొదటి పేజీ తరువాయి

# ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

పోతున్నారని, ఎరువులు, విత్తనాల కొరతను అధిగమించామని చంద్రబాబు తెలిపారు. వంశధార, నాగావళిని అనుసంధానం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. నారాయణపురం ఆనకట్టను ఆధునీకరిస్తామన్నారు. 13 ఎత్తిపోతల పథకాల పనులు జరుగుతున్నాయని, రూ. 2వేల కోట్లతో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలని, వ్యవసాయంలో టెక్నాలజీ వాడాలని చంద్రబాబు రైతులకు సూచించారు.

ట్రాక్టర్ నడిపిన సీఎం చంద్రబాబు

జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆమదాలవలస మండలం రావికంటపేట గ్రామం వ్యవసాయ క్షేత్రంలో ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతులతో కలిసి నాట్లు వేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి టాక్టర్‌ను నడిపారు. అనంతరం ప్రభుత్వం ప్రతిష్టాత్మకం చేపట్టిన చంద్రన్న రైతు బీమా పథకాన్ని జగ్గుశాస్త్రులపేటలోని ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం వద్ద చంద్రబాబు ప్రారంభించారు.

# మాజీ ప్రధాని పీవీది ప్రత్యేక శైలి

నివాళి అర్పించారు. దిల్లీలోని ఏపీ భవన్‌లో పీవీ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భగా జేసీ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశానికి ప్రధానులు చేసిన వారందరిలో పీవీ నరసింహారావుది ప్రత్యేక శైలి అని కొనియాడారు. ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపించారన్నారు.

**పీవీది అద్భుత నాయకత్వం .. ప్రధాని నరేంద్ర మోదీ**
**నేడు పీవీ 97వ జయంతి**

మాజీ ప్రధాని పీవీ నర్సింహా రావు జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ మేరకు ట్విట్టర్‌లో స్పందించారు. పీవీ నర్సింహా రావు ఓ రాజనీతిజ్ఞుడు అని పేంర్కొన్నారు. దేశ కష్టకాలంలో పీవీ అద్భుతమైన నాయకత్వం అందించారన్నారు. పీవీ లోతైన పరిజ్ఞానం, విజ్ఞత కలిగిన వ్యక్తి అన్నారు. పీవీ నర్సింహా రావు బహుభాషా కోవిదుడు, నూతన ఆర్థిక సంస్కరణలను దేశానికి పరిచయం చేసిన ఆర్థిక వేత్త అని తెలంగాణ హోంమంత్రి నాయిని నరసింహా రెడ్డి కొనియాడారు. పీవీ జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీవీ జ్ఞానభూమిలో ఆయన సమాధికి పుష్పాంజలి ఘటించారు. మైనారిటీ ప్రభుత్వాన్ని పూర్తికాలం నడిపిన ఘనత పీవీదే అన్నారు. పీవీ మరణానంతరం కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరు సమంజసం కాదన్నారు. పీవీ నర్సింహా రావు చిత్రపటానికి టీడీపీ ఎంపీలు ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జేసీ దివాకర్ రెడ్డి మాట్లాడారు. భారతదేశానికి ప్రధానులుగా చేసిన వారందరిలో పీవీది ప్రత్యేక శైలి అన్నారు. ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాన్ని అభివృద్ధి బాటలో నడిపించారన్నారు.

# ఎస్పీ, బీఎస్పీలపై మోదీ విమర్శల దాడి

లబ్ధితో కాంగ్రెస్‌తో చేతులు కలిపాయని సంత్ కబీర్ నగర్ జిల్లాలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో మోదీ అన్నారు. ఇటీవల జరిగిన కైరానా లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ఎస్పీ, కాంగ్రెస్‌ల మద్దతుతో ఆరెల్డీ అభ్యర్థి బీజేపీని మట్టికరిపించిన విషయం తెలిసిందే. ఎస్పీ, బీఎస్పీ నేతలకు సమాజ్, బహుజన్ వంటి పదాలు పట్టవని వారు కేవలం తమ కుటుంబాల కోసమే తపన పడతారని మోదీ విమర్శించారు. కాగా, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అత్యధికంగా 80 ఎంపీ సీట్లున్న ఉత్తర్ ప్రదేశ్ కీలకంగా మారింది. బీజేపీకి ఎస్పీ, బీఎస్పీ, కాంగ్రెస్‌లు సమిష్టిగా పోటీ చేసి గట్టి షాక్ ఇవ్వాలని భావిస్తుండగా, విపక్షాలను దీటుగా ఎదుర్కొనేందుకు బీజేపీ కసరత్తు చేస్తోంది.

# వైద్య సేవలు భేష్

డాక్టర్ అర్జున్, ఆర్‌ఎంఓలు డాక్టర్ ఎఎస్‌ఎల్‌జి శాస్త్రి, డాక్టర్ విజయ్ శంకర్ తదితరులతో కలెక్టర్ కొంతసేపు ముచ్చటించారు. అనంతరం రోగులకందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సంక్షేమం విభాగంలోని ఒన్‌స్టాప్ సెంటర్, గైనిక్, ప్రసూతి తదితర వార్డులను సందర్శించి అక్కడి రోగులను పలకరించి వారికి సరియైన వైద్యం అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఈ మధ్య కాలంలో ప్రారంభించబడిన రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ రిస్ట్ బ్యాండ్ పని చేసే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. విజయనగరం, పాడేరు, అరుకు తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న రోగులను పలకరించి వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో తగిన వైద్య సేవలందించాలి వాటిపై ఒకటి రెండు రోజుల్లో నివేదికనందించాలని వైద్యాధికారి డాక్టర్ దేవిని కలక్టర్ ఆదేశించారు.

అనంతరం డెంగ్యూ వ్యాధిగ్రస్తులకు కేటాయించిన ప్రత్యేక వార్డునూ కలక్టర్ పరిశీలించారు. సత్వరమే వారు కోలుకునేలా వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ ప్రాంత వాసులకే ఎక్కువగా డెంగ్యూవాధి రావడానికి గల కారణాలపై ఆరా తీశారు. సుమారు 270 రక్త నమూనాలు సేకరించినవాటిలో 220 డెంగ్యూ కేసులుగా నిర్ధారించినట్లు గుర్తించి వారు ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్నారు. వారికి జరుగుతున్న చికిత్స విధానంపైనా, వారి రోగాల వివరాలపైనా సత్వరమే నివేదిక అందజేయాలని కలక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు.

**ప్రజల సహకారం ఎంతో అవసరం**

కలెక్టర్ పర్యటన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా తదితర సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముందస్తు జాగ్రత్తలతోనే వ్యాధుల నివారణ సాధ్యమని అన్నారు. ఈ వ్యాధుల నియంత్రణపై అవగాహన కలిగించేందుకు ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

**ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులతో త్వరలో సమీక్ష**

ప్రైవేటు ఆస్పత్రులలో డెంగ్యూ కేసులు ఎక్కువ ఉన్నట్లు గుర్తించిన కలక్టర్ ప్రవీణ్‌కుమార్ రోగుల వివరాలతో నివేదిక త్వరలో అందజేయాలని ప్రభుత్వ వైద్యాధికారులను ఆదేశించారు. మరో రెండు రోజుల్లో ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నామన్నారు.

ఈ పర్యటనలో కలెక్టర్ తోపాటు కెజిహెచ్ ఆర్‌ఎంఓలు డా. ధర్మారావు, డా. ఇందిరా దేవి, అదనపు జిల్లా వైద్య శాఖాధికారి డా. దేవి, వైద్యాధికారులు, డిఆర్‌డిఎ, ఏపిడి తదితరులు పాల్గొన్నారు.

# పోర్టు బాధితులకు అండగా ఉంటా

- బొగ్గు, జబ్బులు మీకు, డబ్బులు పోర్టుకా!?
- తమ కష్టాలను ఏకరవు పెట్టిన 'బొగ్గు' బాధితులు
- నేను మీకు హామీగా ఉంటానని జనసేన అధ్యక్షుడు పవన్ హామీ



విశాఖపట్నంః జనసేన అధినేత, ప్రముఖ సినీ నటుడు పవన్ కల్యాణ్ పోర్టు ప్రాంతానికి వచ్చారని తెలుసుకున్న ఆ ప్రాంత వాసులు తమ గోడును అధినేత వద్ద వెళ్ళగక్కారు. పోర్టు యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా తాము ఎన్నిసార్లు విన్నవించినా తమ కష్టాలు తీర్చడం లేదని వన్‌టౌన్ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలినడకన వన్‌టౌన్ ప్రాంతంలో పర్యటించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆ ప్రాంత వాసులను కలిసి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. స్థానికంగా రాసులుగా పోసిన బొగ్గు నిల్వలను చూసి విస్తుపోయారు. సముద్రపు గాలికి అదికాస్త దుమ్ముగా రేగి పట్టణంవీధులగుండా దుమ్ము రేగడాన్ని గమనించారు. అక్కడ నివసిస్తున్న స్థానికులతో మాట్లాడి వారు పడుతున్న బాధలను గమనించారు. వారికి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ లసందర్బంగా ఆయన మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం నిల్వలుంచుతున్న బొగ్గు, ఇనుప ఖనిజం, గంధకంలతో వ్యాధులు స్తానికులకా? డబ్బులు మాత్రం యాజమాన్యం అనుభవించడం చాలా దారుణమని అన్నారు. పోర్టు ట్రస్టు నిర్లక్ష్యంగా ఇక్కడి ప్రజలు, సంఘాలు ఎన్నిసార్లు హెచ్చరించినా ప్రభుత్వాలు వినకపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేసి స్థానికుల పోరాటానికి తాను అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.

# ఏపి ఆర్‌సెట్ నోటిఫికేషన్ 30న విడుదల



ఏపిఆర్‌సెట్ నోటిఫికేషన్ వివరాలు విడుదల చేస్తున్న వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు

ఆంధ్రాయూనివర్శిటీ : రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో పరిశోధనల్లో ప్రవేశాలకు తొలిసారిగా నిర్వహిస్తున్న ఏపిరీసెర్చ్ సెట్ నోటిఫికేషన్‌ను ఈ నెల 30వ తేదీన విడుదలచేస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు తెలిపారు. గురువారం ఉదయం ఏయూ సెనేట్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

14 విశ్వవిద్యాలయాలలో 73 విభాగాలలో పిహెచ్‌డి, ఎంఫిఎల్ కోర్సులకు ప్రవేశాలను ఏపిఆర్‌సెట్‌తో నిర్వహించడం జరుగుతుందన్నారు. సెట్ నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం ఏయూకు అప్పగించిందన్నారు.ఏపిఆర్‌సెట్ నోటిఫికేషన్‌ను ఈ నెల 30వ తేదీన విడుదల చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ జూలై 4వ తేదీ నుంచి నిర్వహిస్తామని, జులై 25వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. రూ 2 వేల అపరాధ రుసుముతో ఆగష్టు 3వ తేదీ వరకు, రూ 5 వేలు అపరాధ రుసుముతో ఆగష్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. హాల్ టికెట్లను ఆగష్టు 14 నుంచి 17వ తేదీ వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. ప్రవేశ పరీక్షను ఆగష్టు 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు.దరఖాస్తు రుసుముగా ఎస్సీ,ఎస్టీ, దివ్యాంగులు రూ 1000, ఇతరులు రూ 1400 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రవేశలో పరీక్షలో 50 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుందన్నారు.

ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 45 శాతం మార్కులు సాధిస్తే అర్హత పొందుతారన్నారు.పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు. వ్రాత పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు మౌఖిక పరీక్ష(ఇంటర్వ్యూ)కు హాజరు కావాలన్నారు. విద్యార్థి ఎంపిక చేసుకున్న విశ్వవిద్యాలయంలో మౌఖిక పరీక్ష నిర్వహిస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు ర్యాంకులు కేటాయించి వీటి ఆధారంగా ఖాళీలు భర్తీ చేయడం జరుగుందన్నారు. పిహెచ్‌డిలో 2400, ఎంఫిఎల్‌లో 500 సీట్లు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు, ఏపిఆర్‌సెట్ కన్వీనర్ ఆచార్య కె.శ్రీనివాసరావు, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య పి.బాబి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# విమ్స్‌ను ప్రైవేటీకరణ చేయెుద్దు

- విమ్స్‌ను ప్రభుత్వమే నడపాలి
- 100 కోట్లు నిధులివ్వాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ నరసింగరావు




విశాఖపట్నంః విమ్స్ ఆస్పత్రిని ప్రైవేట్ పరం చేయెుద్దని, ప్రభుత్వమే నడపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. నరసింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలో సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విమ్స్ ఆస్పత్రిని ప్రైవేట్‌పరం చేసే జిఓ 33ను తక్షణమే రద్దు చేయాలని, పర్మినెంట్ డాక్టర్లను నియమించాలని, 100 కోట్ల నిధులు మంజూరు చేయాలని అన్నారు. పాత డైరీఫాం నుండి ఆదర్శనగర్, సుందర్‌నగర్, వివేకానందనగర్, ఎస్‌ఐజి నగర్, రవీంద్రనగర్ మీదుగా తోటగరువు జంక్షన్ వరకు ఇంటంటికీ పాదయాత్ర జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్స్ తరహాలో విమ్స్‌ను తీర్చిదిద్దుతామన్నారని చెప్పి నేడు ప్రైవేటీకరణకు పూనుకోవడం దారుణమన్నారు. పేదలకు ఉచితంగా వైద్య సేవలందించవలసిన ఈ స్థితిలో విమ్స్‌ను ప్రైవేటీకరణ చేయడం చాలా బాధాకరమని అన్నారు. ఈ విషయమై పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్నామని తెలిపారు. దీనికి ప్రజాసహకారం ఎంతైనా అవసరమన్నారు. జిఓ 33ను విడుదల చేసి 10 సూపర్‌స్పెషల్ డిపార్ట్‌మెంట్లను ప్రైవేటీకరణ చేయడానికి ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. దీంతో పేదలు వైద్యానికి దూరమౌతారని విమర్శించారు. విమ్స్ ప్రైవేటీకరణ విషయమై జూలై 3న 48 గంటల పాటు నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. విమ్స్ ఆసుపత్రి వద్ద చేపట్టనున్న నిరాహరణ దీక్షను జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. నరసింగరావు ప్రజలను కోరరారు. ఈ విషయమై ప్రజలకు కరపత్రాలను కూడా పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఆరిలోవ, మద్దిలపాలెం జోన్ కార్యదర్శులు పి శంకరరావు, ఎస్. రంగమ్మ, వి.ఎన్. కుమార్, చిట్టిరాణి. కుమారి, భానుమతి, నజీర్, ఐసిహెచ్ నాయుడు, అన్నపూర్ణ, అరసాడ రమణ, వెంరటరావు, రాజేష్, సూరిబాబు, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

## రోజు రోజుకు పెరుగుతున్న డెంగ్యూ వ్యాధిగ్రస్థులు

భీమునిపట్నం : తగరపువలస, భీమునిపట్నం, భీమిలి రూరల్ ప్రాంతాల్లో డెంగ్యూ వ్యాధి బారిన పడిన వారు పెరిగిపోతున్నారు. తగరపువలస గ్రామానికి చెందిన విద్యార్థి డెంగ్యూ వ్యాధి తో మృతి చెందిన సంఘటన తెలిసిందే. కాగా రామవీధికి చెందిన వ్యక్తి కి సోకింది. అదే విధంగా రాజవీధికి చెందిన ఇద్దరు వ్యక్తులకు,శ్రీనగర్ కు చెందిన ఇద్దరు వ్యక్తులకు ఈ లక్షణాలు ఉన్నాయి. అదే విధంగా భీమిలి బ్యాంక్ కాలనీ కి చెందిన ఇద్దరు బాలికలకు ఈ లక్షణాలు ఉండడంతో వీరిద్దరిని ఆసుపత్రిలో జాయిన్ చేసారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో చేపలుప్పాడ,అమనాం, తాటితూరు, టి.నగరపాలెం, లక్ష్మీ పురం తదితర ప్రాంతాల్లో కూడా ఈ వ్యాధిన పడినవారు ఉన్నారు. దీనికి కారణం పరిసరాలు పరిశుభ్రంగా ఉండకపోవడం తో ఈ వ్యాధి ప్రభలుతున్నట్లు ఆయా గ్రామస్థులు చెప్పారు.

## జూలై 2 నుంచి తరగతులకు హాజరు కావాలి

ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామమోహనరావు



ఏయూ : ఆంధ్రవిశ్వ విద్యాలయం పరిధిలోని విభాగా లలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు జూలై 2వ తేదీ నుంచి తరగతులకు హాజరు కావాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామ మోహన రావు తెలిపారు. మూడు రోజలు పాటు విద్యార్థులకు అవగాహన తరగతులను నిర్వహించడం జరుగుతుందన్నారు. వర్సిటీలో విద్యార్థులకు అందిస్తున్న వసతులు, క్రీడలు, యోగా, విదేశా భాషల అధ్యయన విభాగం, వసతి గృహాలు, ఆరోగ్య కేంద్రం, గ్రంధాలయం, ఉపాధి కల్పన తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.




## జూన్ 30 లోగా ఆస్తిపన్ను చెల్లించండి

- కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానకు చెందిన ఆస్తిపన్ను నీటి ఛార్జీలను జివియంసి ప్రధాన కార్యాలయం సౌకర్యం, జోనల్ కార్యాలయాల సౌకర్యం కేంద్రాలు మరియు మీసేవా కేంద్రాలలో జూన్ 30 లోగా చెల్లించి అపరాధరుసుం (వడ్డీ) నుండి మినహాయింపు పొందాలని కమిషనర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జివియంసి అభివృద్ధికి దోహదపడాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రిజర్వాయర్ల మరమ్మత్తు పనులకు నిధులు

కొయ్యూరు : ప్రపంచ బ్యాంకు నిధులతో మండలంలోని లుబ్బర్తి జలాశయ మరమ్మత్తు పనులకు రూ.60లక్షలు, కించవానిపాలెం రిజర్వాయర్ మరమ్మత్తు పనులకు రూ.80లక్షలు కేటాయించినట్లు దీని నిమిత్తం త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు ఎస్ఎంఇ డిఇ జగదీశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక జెఇ రామకృష్ణతో కలిసి మండలానికి వచ్చిన ఆయన కొయ్యూరు చెక్‌డ్యాం పనులను పరిశీలించి పనుల తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా మరెన్ని సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సూచనలు, సలహాల మేరకు నీరు చెట్టు పనులను సంతృప్తికరంగా పూర్తి చేస్తున్నట్లు ఆయన వివరించారు.

# ర్యాగింగ్ చట్టాలపై అవగాహనా ర్యాలీ




విశాఖపట్నం : ర్యాగింగ్ కు పాల్పడే వారిపై అమలు జరిగే కఠిన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగించడానికి గీతం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీని నిర్వహించారు.గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్ జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.ధర్మరాజు, విద్యార్థి విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ కె.వీరభద్రం, ఎన్.ఎస్.ఎస్.కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జి.వి.స్వామి, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అది. కారులు మహ్మద్ కె.ఎమ్.చిస్టి, డాక్టర్ బి.సూరిబాబు పాల్గొన్నారు.

## ప్రజల అభిష్టం మేరకు ప్రజాప్రతినిధులు నడుచుకోవాలి

ఉత్తర నియోజక వర్గం ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్‌రాజు



కంచరపాలెం : ప్రజల అభిష్టం మేరకు ప్రజాప్రతినిధులు నడుచుకోవాలని ఉత్తర నియోజక వర్గం ఎమ్మెల్యే పి .విష్ణు కుమార్ రాజు పేర్కొన్నారు . ఈమేరకు జీవీఎంసీ 39 వ వార్డు మాధవధార ప్రాంతం ఈస్ట్ వైపు గా 130 లక్షల వ్యయంతో 660 మిటర్ల మేరా నిర్మించనున్న డ్రైన్ నిర్మాణపనులకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఇప్పటికే మాధవధార పరిసర ప్రాంతల్లో మౌలిక వసతులు కల్పించే విదంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పేద ప్రజలకు చేయూత నిచ్చే విదంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని గుతేధారునికి సూచించారు . అదేవిదంగా వెస్ట్ పాయింట్లో 145 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైన్ మరియు సెంట్రల్ డివైడర్ నిర్మాణపనులకు సంబంధించి శుక్రవారం శంకుస్థాపన చేయ. కార్యక్రమంలో ఈ.ఈ బి.నర్సింహరావు, ఎ ఈ గుప్తా, బిజెపి, టీడీపి నాయకులు స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రై డే పాటించండి

## డెంగూ, మలేరియా నివారించండి

- కమిషనర్ హరినారాయణన్

విశాఖపట్నం : జివియంసి పరిధిలోని ప్రజలు వారానికి ఒకరోజు డ్రై డే పాటించడం ద్వారా డెంగూ, మలేరియా వ్యాధులను నివారించవచ్చునని కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. డెంగూ జ్వర కారక క్రిమి ఏడిస్ ఈజిప్టి జాతి దోమ ద్వారా వ్యాధి సంక్రమిస్తుంది. ఈ దోమలు పగటిపూట ఇంటిలోని ఫ్రిజ్, ఖాళీ సీసాలు, కొబ్బరి బోండాలు, పాత టైర్లు, ట్యూబులు ఆర్నమెంటల్ ప్లాంట్స్‌లో ఉంటాయి. ఇంటి లోపల - బయట పరిసరా లను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధి సోకకుండా నివారించవచ్చును. దోమ కుట్టిన 5-8 రోజులకు వ్యాధి లక్షణాలు కన్పిస్తాయి. జ్వరం 24 గంటలలో తగ్గకపోతే రక్త పరీక్ష చేయించుకొని, చికిత్స చేయించుకోవాలి. ముందు జాగ్రత్తగా ప్రతి గృహిణి తన ఇంటిలోని నీటి తొట్టెలను ఖాళీ చేసి మరల తాజా నీటితో నింపు కోవాలి. ఇంటిపై వాటర్ ట్యాంకులకు మూతలు బిగించాలి.

ఇంట్లోని ఏసిలు, ఎయిర్ కూలర్స్, ఫ్రిజ్, ఫ్లవర్ వాజ్‌లు, మనీప్లాంట్‌లోని నీటిని మూడురోజులకు ఒకసారి పారబోసి నింపుకోవాలి.డెంగూ నిర్ధారణ పరీక్షలు కె.జి.హెచ్‌లోనే చేసే అవ కాశం ఉన్నందున డాక్టర్ సలహాతో నిర్ధారణ గావించుకొని చికిత్స పొందాలి. కావున ప్రజలు అప్రమత్తతతో కొంచెం శ్రమపడితే అనారోగ్యానికి గురవ కుండా ఆరోగ్య విశాఖకు దోహదపడతారని పేర్కొన్నారు.

# ప్రధానమంత్రి చంద్రన్నబీమా అందజేత



కంచరపాలెం : జీవీఎంసీ 39 వ వార్డు పరిది మాధవధార ప్రాంతం ఉడా కోలనీలో నివాసముంటున్న తుమ్మలపల్లి గౌరి ఇటివలే అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమే కుమారుడు ఈశ్వరావు కు ప్రధానమంత్రి చంద్రన్న భీమా రెండు లక్షల రూపాయలు చెక్కుని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్య క్రమంలో భీమా మిత్ర సభ్యులు పద్మజ, దవల కుమారి శాంతి, ఎస్.బంగార్రాజు ప్రధాన కార్యదర్శి పెంటకోట నాగమణి, పి.లలిత కుమారి పాల్గొన్నారు.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

**విశాఖపట్నం రైల్వే స్టేషన్ జ్ఞానపురం వైపున పార్కింగ్ స్టాండు**

టెండరు ప్రకటన సంఖ్య. WCL/1/PCP/GNPM/VSKP/2018, తేది. 22.06.2018

**పని పేరు:** విశాఖపట్నం రైల్వే స్టేషన్ యొక్క జ్ఞానపురం వైపున ప్రీమియం కారు పార్కింగ్ స్టాండ్ కొరకు కాంట్రాక్టు మేనేజుమెంట్ (1292 చ.మీటర్లు).

**03 సంవత్సరాలకు లైసెన్సు విలువ:** ₹27,24,275/-, బయానా: ₹2,72,430/-, టెండరు ఫారం ఖరీదు: ₹ 3,000/-.

టెండరు ఫారంలు అమ్మకం: **28.06.2018**న **1100** గంటల నుండి, టెండరు ఫారంలు అమ్మకం ఆఖరు తేదీ & సమయం: **29.07.2018**న **1500** గంటల వరకు, టెండర్లు స్వీకరించు ఆఖరు తేదీ & సమయం: **30.07.2018**న **1500** గంటల వరకు, **టెండరు తెరచు తేదీ & సమయం: 30.07.2018**న **1530** గంటలకు

టెండరు ఫారంలు లభించు చోటు: డివిజనల్ కమర్షియల్ మేనేజర్ (Co.Ord) వారి కార్యాలయం, ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేరు, స్టేషన్ రోడ్, డొండపర్తి, విశాఖపట్నం-4 వద్ద పొందవచ్చును. టెండరు డాక్యుమెంట్లు వెబ్‌సైట్ **www.eastcoastrail.indianrailways.gov.in** నందు కూడ లభిస్తాయి.

ఇంటర్నెట్ నుండి పొందిన టెండరు డాక్యుమెంట్లలో ఏదైన వ్యత్యాసమున్నచో ఈ కార్యాలయం నందు లభించే మాస్టరు కాపీతో సరిచూసుకోవలెను మరియు టెండరు దారు(లు) అందుకు కట్టుబడి ఉండాలి. ఇందుకు సంబంధించి ఎలాంటి క్లెయిమ్‌లు పరిశీలించబడవు.

డివిజనల్ కమర్షియల్ మేనేజర్ (Co.Ord), వాల్తేరు

PR-186/J/18-19

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

**అద్దెకు వాహనములు**

ఇ-టెండరు ప్రకటన నెం.: **ETCECONIBBS 2018050** తేదీ. **21.06.2018**

**పని పేరు:** డిప్యూటి ఛీఫ్ ఇంజనీరు (CON) మరియు డిప్యూటి ఫైనాన్సియల్ అడ్వైయిజర్ & ఛీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ (CON), ఈస్ట్ కోస్ట్ రైల్వే, విశాఖపట్నం వారి వాడకం కొరకు (నాన్- ఎసి టాటా సుమో / బొలెరో లేదా తత్ సమానమైనది) అద్దె వాహనములు ఒక సంవత్సర కాలంనకు అద్దెకు సరఫరా చేయుట.

**పని విలువ సుమారు:** ₹ **12.88** లక్షలు, బయానా: ₹ **25,770/-**, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ **2,000/-**, పని పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు) నెలలు.

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 30.07.2018**న **1200** గంటలు.

ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికి అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించవడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు **http://www.ireps.gov.in** వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి పదిహేను రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయమైనది.

ఛీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (Con), భువనేశ్వర్

PR-43/CB/18-19

భారత ప్రభుత్వం
ఆరోగ్య & కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ

**ఆక్సిటోసిన్ మిశ్రమాలకు సంబంధించి బహిరంగ ప్రకటన**

ప్రభుత్వము దేశీయ అవసరాలకై ఆక్సిటోసిన్ మిశ్రమాల తయారీలను 1 జూలై 2018 నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు మాత్రమే పరిమితం చేస్తుంది.

**1 జూలై 2018 నుంచి ఏ ప్రైవేట్ తయారీదారు దేశీయ అవసరాలకై మందుల తయారీకు అనుమతించబడదు.** కేవలం కర్ణాటక యాంటీబయోటిక్స్ & ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ కెఎపిఎల్, ఒక ప్రభుత్వ రంగ సంస్థ మాత్రమే ఆ తేదీ నుంచి దేశీయ అవసరాలకై మందులను తయారీ చేయనుంది. దేశీయ వినియోగం కోసం ఉద్దేశించిన ఆక్సిటోసిన్ మిశ్రమాలు సదరు తయారీదారు అనగా కెఎపిఎల్ వారి ద్వారా ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాల్లో నమోదిత ఆసుపత్రులు మరియు క్లినిక్‌ల్లో నేరుగా సరఫరా చేయబడును.

**రిటైల్ కెమిస్ట్‌ల ద్వారా ఆక్సిటోసిన్ ఏ రూపంలో లేదా పేరుతో అమ్మకము జరిపేందుకు అనుమతించబడదు**

ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాల్లోని అన్ని నమోదిత ఆసుపత్రులు మరియు క్లినిక్‌లు దేశంలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు రంగాల్లోని నమోదిత ఆసుపత్రులు మరియు క్లినిక్‌లు కెఎపిఎల్‌ను సంప్రదించి, సదరు మందు రిటైల్ కెమిస్ట్‌లు లేదా ఏ ఇతర తయారీదారులు వద్ద లభించదు కావున తమ ఆర్డర్లను ఇవ్వగలరని తెలియజేయడమైనది.

కెఎపిఎల్‌ను సంప్రదింపు వివరాలు:

ఇమెయిల్: instmkt@kaplindia.com

డాక్టర్. ముకేష్ కుమార్ - 9880175766
మిస్టర్. సంతోష్ కుమార్ - 9901611277
మిస్టర్. సునీల్ కుమార్ కైమాల్ - 9845231019

davp 17102/11/0021/1819

# విజయభాను

## సంపాదకీయం

### నిరంకుశ పాలన

మహిళలకు హక్కులు ఇస్తే సమాజం భ్రష్టుపట్టి పోతుందని, పాపం పెరుగుతుందని ఛాందసవర్గం వాదిస్తున్నది. డ్రైవింగ్ చక్రం వెనుక కూర్చుంటే, మహిళల గర్భాశయం దెబ్బతిని, సంతాన హీనత ఏర్పడుతుందని వింతవాదనలు ముందుకుతెచ్చింది. సౌదీ అరేబియాలో మహిళలకే కాదు, పౌరులెవరికి ప్రజాస్వామిక హక్కులు లేవు. ప్రపంచంలోనే అత్యంత నిరంకుశ రాచరికాలలో సౌదీ అరేబియా ఒకటి. సౌదీ అరేబియాలో మహిళలకు వాహనాలను నడుపడంపై నిషేధాన్ని ఎత్తివేయడం ప్రపంచ వ్యాప్తంగా సంచలన వార్త అయింది. కొంతకాలంగా సౌదీ యువరాజు మహహ్మద్ బిన్ సల్మాన్ అభ్యుదయవాది అయినట్టు, దేశంలో సంస్కరణలు ప్రవేశపెడుతున్నట్టు కొంతకాలంగా ప్రచా రం సాగుతున్నది. ప్రత్యేకించి యూరప్ దేశాల్లో ఈ ప్రచారం ఎక్కువగా ఉన్నది. తాజాగా మహిళలు వాహనం నడుపుడుపై కొన్ని దశాబ్దాలుగా ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడం కూడా ఈ సంస్కరణల్లో భాగంగా ప్రచారం చేస్తున్నారు. కానీ అక్కడ మహిళల పరిస్థితిలో మార్పు లేదు. వాహనాలు నడుపుడుపై నిషేధాన్ని ఎత్తివేయడం ఒక హర్షించదగిన చర్యే అయినప్పటికీ, అక్కడి పరిస్థితితో పోలిస్తే ఇదొక గొప్ప మార్పు కూడా కాదు. ప్రపంచం మొత్తమ్మీద ఇప్పటి వరకు ఒక్క సౌదీ అరేబియాలోనే మహిళల డ్రైవింగ్‌పై నిషేధం ఉండేది. మహిళలు వాహనాలు నడిపే హక్కు కోసం కొన్నేండ్లుగా ఉద్యమాలు చేసి తీవ్ర అణిచివేతను ఎదుర్కోవలసి వచ్చింది. డ్రైవింగ్‌పై నిషేధాన్ని ఎత్తివేసినప్పటికీ, ఇంకా ఈ హక్కు కోసం ఉద్యమించిన మహిళలు జైళ్ళలో మగ్గుతున్నారు. 1990లో డజన్ల కొద్ది మహిళలు సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో నిషేధాన్ని ధిక్కరిస్తూ వాహనాలు నడిపి అరెస్టయ్యారు. 2008లో కూడా వాహనాలు నడుపుతూ ఆ దృశ్యాల ను చిత్రీకరించి ప్రసారం చేశారు. 2011 నుంచి మూడేండ్లపాటు మళ్ళా ఉధృత ఉద్యమం సాగింది. గత నెలలో కూడా ఉద్యమించిన మహిళలను జైళ్ళలో పెట్టారు. ప్రభుత్వం వీరిపై విద్రో హ కేసులు పెట్టి వేధిస్తున్నది. ఎట్టకేలకు డ్రైవింగ్‌పై నిషేధం ఎత్తివేసినా, ఇంకా మహిళలకు మగవారితో సమానంగా హక్కుల్లేవు. దేశంలో అణిచివేత విధానాలు మారలేదు. ఇప్పటికీ సౌదీ అరేబియాలో చట్ట ప్రకారం మహిళలు మగవారి సంరక్షణలో ఉండవలసిం దే. మగవారి అనుమతి లేకుండా ప్రయాణించకూడదు. విడాకులు తీసుకునే అవకాశం లేదు. జైలునుంచి విడుదలైన ఖైదీని కూడా తీసుకుపోవడానికి మగవారు లేకుంటే బయటి కి పోనీయరు. మహిళలకు సమాన హక్కులను రాజ్యాంగపరంగా గుర్తించిన దేశాల్లోనే సామాజికంగా ఇంకా సమానత్వం సిద్ధించలేదు. మహిళలకు హక్కుల కోసం పోరాడవలసి వస్తున్నది. ఇక మహిళలు మగవారి పెత్తనం కింద ఉండాలని చట్టమే చెబుతుంటే, సౌదీ అరేబియాలో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ప్రభుత్వం సామాజిక ఆర్థి క మార్పునకు దోహదపడకుండా, ఛాందసభావజాలాన్ని పెంపు చేస్తున్నది. దీంతో సామాజిక అణిచివేత మహిళలపై తీవ్రంగా ఉన్నది. మహిళలకు హక్కులు ఇస్తే సమాజం భ్రష్టుపట్టి పోతుందని, పాపం పెరుగుతుందని ఛాందసవర్గం వాదిస్తున్నది. డ్రైవింగ్ చక్రం వెనుక కూర్చుంటే, మహిళల గర్భాశయం దెబ్బతిని, సంతాన హీనత ఏర్పడుతుందని వింతవాదనలు ముందుకుతెచ్చింది. సౌదీ అరేబియాలో మహిళలకే కాదు, పౌరులెవరికి ప్రజాస్వామిక హక్కులు లేవు. ప్రపంచంలోనే అత్యంత నిరంకుశ రాచరికాలలో సౌదీ అరేబియా ఒకటి. ఇంత అణిచివే త సాగుతున్నా సౌదీ అరేబియాలో సంస్కరణలు సాగుతున్నట్టు, అక్కడి యువరాజు అభ్యుదయవాది అయినట్టు ప్రచారం కావడం గమనార్హం. అనేక దేశాలలో మానవ హక్కులకు భంగం కలుగుతున్నదంటూ దాడులకు కూడా దిగే అమెరికా సౌదీ అరేబియా విషయంలో మౌనం వహిస్తున్నది. అమెరికా, యూరప్ దేశాల చేతిలో కీలుబొమ్మ కావడం వల్లనే యువరాజు సల్మాన్ ఏది చేసినా చెల్లుతున్నది. అరబ్ ప్రాంతంలోని సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదితర దేశాలలో పాశ్చా త్య దేశాలు నిరంకుశ ప్రభుత్వాలను ఏర్పాటు చేసి కాపాడుతున్నాయి. ఇరాక్ వంటి దేశాల్లో మహిళల పరిస్థితి, పౌర హక్కులు మెరుగ్గా ఉన్నా అక్కడి ప్రభుత్వాలను అప్రతిష్ఠపాలు చేసిన అమెరికా, సౌదీ అరేబియా తదితర నిరంకుశ రాజ్యాల పట్ల మాత్రం మెతక వైఖరిని అవలంబిస్తున్నది. సౌదీ రాజు వృద్ధుడు కావడంతో యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ అధికారం చేజిక్కించుకొని చక్రం తిప్పుతున్నాడు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు, సల్మాన్‌కు భావ సారూప్యం ఉన్నది. సల్మాన్ బలపడిన నాటి నుంచి దేశంలో తీవ్ర అణచివేతను సాగిస్తున్నాడు.

## రైతు శ్రేయస్సు కొరకు ఏరువాక పౌర్ణమి కార్యక్రమం

వ్యవసాయశాఖ ఏడిఏ ఎం.రత్నప్రశాంతి



పెద్దాపురం: రైతు శ్రేయస్సు కొరకు ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశ్శాఖ ఏడిఏ ఎం.రత్నప్రశాంతి తెలిపారు. గురువారం మండలంలోని గోరింట గ్రామంలో గ్రామ ఉప సర్పంచి కలగాడ పాపారావు వ్యవసాయ భూమిలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏడిఏ ఎం.రత్నప్రశాంతి మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి రైతులకు పంటసాగును ప్రారంభించే పరమ పవిత్రమైన రోజు అని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం నియోజకవర్గ పరిధిలో వ్యవసాయశాఖ ద్వారా ఏరువాక పౌర్ణమి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రైతులు పండించే పంటకు అధిక దిగుబడి వచ్చి రైతుకు ఆదాయం సమకూర్చే సంకల్పంతో పంట భూమికి, నాగలి కట్టిన ఎద్దులకు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రైతులు పాల్గొనడం ఆనందదాయకమని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్కబీపంచి కలగాడ పాపారావు మాట్లాడుతూ దేశానికి రైతే వెన్నుముఖ అని అన్నారు.

ఈ కార్యక్రమానికి ఉప సర్పంచి కలగాడ పాపా రావు, వంగలపూడి త్రిమూర్తులు, పచ్చిపాల ప్రసాదరావు, రైతులు భూమిని దున్ని విత్తనాలు చల్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మా ఛైర్మన్ కె.రాంబాబు, ద్వారకాదేవి, ఎం.శామ్యూల్‌ఖాన్, సుధీర్‌కుమార్, జానకి, కె.ఉదయ కుమార్, బాలాజీ, అనూరాధ, దుర్గ, ఆర్.శ్రీనివాస్, కర్రి శ్రావణి, భవిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల డ్రామ...అవినీతికి కామా...

విజయనగరం : భక్తునికి, భగవంతునికి మధ్య ఎక్కడైనా పూజారులు, కమిటీలు ఉంటాయి. ఇది ప్రాపంచకమైన విషయం. అయితే భగంతుని ఆలనా, పాలనా వారు చూస్తే...భక్తులని భగవంతుడు చూస్తాడని నమ్మిక. ఆ నమ్మకం..విశ్వాసం పెంచేవే కమిటీలు, దేవాదాయ ధర్మాదాయ శాఖ. 27వ తేదీన విజయ భానులో ప్రచురితమైన " భగవంతుని శఠగోపం..భక్తులపై కోపం" శీర్షికన వచ్చిన వార్తకు స్థానిక మున్సిపల్ నార్‌వార్డు నివాసితులు స్పందిస్తూ శ్రీమన్నార్ రాజగోపాల్ ఆలయ విశేషాలు, అక్కడ జరుగుతున్న పాలనా విధానాన్ని తెలిపారు. చారిత్రాత్మకమైన కోవెల స్థానిక కొత్తపేటలో ఉందని, దానిని మరుగున పెట్టి శ్రీమన్నార్ రాజగోపాల్ ఆలయ అభివృద్ధిపేరిట అనేక అవకతవకలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గత కొన్నేళ్ళుగా ఉన్న చెరువును కప్పేశారని తెలిపారు. ఈ విషయమై ఆరా తీయగా...944 టౌన్ సర్వే నెంబరులో 8037 చదరపు అడుగుల చెరువు ఉండేది. అది నేడు కనుమరుగైంది. నిజానికి సుప్రీం కోర్టు చెరువుని కానీ, వాటి ఆయకట్టును కానీ, ఆ పరిసరాలని ఆక్రమించినా శిక్షార్హులేనని ఆదేశాలు చెబుతున్నాయి. ఈ విషయంలో విజయనగరం మున్సిపాలిటీ గతంలో బిట్-2లో 226 సర్వే నెంబరు భూమి ప్రజాహితం కోసం ఒక సంస్థ కోరితే చాలా రూల్స్ చెప్పింది. నిజానికి అక్కడచెరువు లేదు. అయితే రికార్డులో చెరువని వుంది. అదే అక్కడ జరిగిన పొరపాటు కానీ, శ్రీమన్నార్ రాజగోపాల్ భూములని చెబుతున్న ఇక్కడ చెరువు వుండేది. 2 ఎకరాల చెరువు దేముడు దేవాలయం పేరిట రికార్డులో నేటికీ వుంది. దానిని అదే మున్సిపాలిటీ కమిటీ సభ్యుల మొగమాటానికో..ఒత్తిడికో లొంగి చెరువును కప్పినా మౌనం వహించారు. అలాగే భూగర్భ జలాల గురించి ఆ ప్రాంతంలో మీటింగులు పెట్టిన వారే ఈ పనినకి సహకరించారని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ స్థలంలో కమిటీకి చెందిన వారు 99ఏళ్ళ లీసుకు ఆస్థలం కావాలని ఇప్పుడు పోటీపడుతున్నారు. అవనాసపు వారి భూములు దేవుని కోసం ఇస్తే..నేడు అవి ఆనవాళ్ళు లేకుండా చేస్తున్నారని విచారం వ్యక్తం చేస్తున్నారు. కారు పార్కింగుకు ఒకరు...ఒక ప్రేవేటు కార్యాలయానికి వేరొకరు ఎవరైతేనేం? ఇది పరిస్థితని చెప్పారు. ఇదిలా వుండగా అక్కడకు సమీపంలో ఉన్న రామాలయానికి కూడా ఈ వాసన సోకింది. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ దేవాలయానికి కూడా కమిటీదే రాజ్యమట. ఎవరు ఎప్పుడు వచ్చినా పట్టించుకోరు. దానికి కళ్యాణమండపం మంజూరైంది. అప్పుడు 13 లక్షల రూపాయలు రాగానే చాలామంది చేరారు. ఏదో అయిందనిపించి..ఆ మండపంలోంచి కమిటీ వెళ్ళి సమావేశాలు నిర్వహిస్తుంది అదీకూడా రహస్యంగా ఇక ఆ మండపానికి గత నెలలో పను& చెల్లించాలని మున్సిపాలిటీ తాఖాదు ఇచ్చింది. గత నెల నుంచి ఎవరూ ఆ నోటీసు తీసుకోలేదు. ఎప్పుడు వెళ్ళినా గుడి మూసివుందని రాస్తుంటారు. ఇది గమనించిన పాత కమిటీ సభ్యులు దానిని తీసుకున్నారు. అది సుమారు లక్ష 30 వేల రూపాయల పై చిలుకు అది కట్టారా? లేదా? అని అడిగినా చెప్పేవారుండరు. ఇక కమిటీలు మారాకా పాత కమిటీ అన్ని పుస్తకాలు, నగలు తదితర సామాగ్రిని అప్పగించాలి. కానీ నేటికీ అది జరగలేదని సుమారు 30 తులాల బంగారానికి 3 , లేదా నాలుగు తులాల బంగారం మాత్రం కనిపిస్తుందని భక్తులు తెలిపారు. ఇది దేవునిపై వారి చిత్తశుద్ధి....హతవిధీ..ఇది మారదా? అని భక్తుల ప్రశ్న.

## మామిడివాడ ఏరువాకలో ప్రారంభించిన ఎమ్మెల్యే రమేష్‌బాబు

యలమంచిలి రూరల్ : రాంబిల్లి మండలంలోని మామిడివాడ గ్రామంలో ఏరువాక పండుగ-2018' కార్యక్రమంలో యలమంచిలి ఎమ్మెల్యే, విశాఖపట్నం (రూరల్) జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు గురువారం ప్రారంభించారు. ముందుగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యములో "ఎరువాక పౌర్ణమి" సంధర్భం గా వ్యవసాయ శాఖ ఆధ్వర్యములో రైతులకు రాయితీ పై వరి విత్తనాలను, ఎరువులను, ఆయిల్ ఇంజన్‌ను, రైతులకు చంద్రన్న భూసార పరీక్షా పత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా 11 జతల ఎద్ధులలో దుక్కిదున్ని రైతులు యొక్క వ్యవసాయ కార్యక్రమంను మొదలు పెట్టారు. ఈ కార్యక్రమములో యలమంచిలి నియోజకవర్గంలోని 4 మండలాల మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు, మండల పరిషత్ అధ్యక్షులు, మరియు యలమంచిలి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ అధ్యక్షులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, రైతులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



దుక్కుదున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

## కవి సమయం

### అమ్మ



అమ్మా! అమ్మా! అని నిన్ను వేడుకొన్నా
అమ్మలోని తీయదనం నాకిమ్మా
ఎన్నో విన్నాను ఎన్నో కన్నాను
అన్నిటికన్నా అమ్మతనం మిన్న ॥అమ్మా॥
అమ్మా! ఓయమ్మా నా కనికమ్మా
బంగారు కొమ్మా రావమ్మా
నన్నేలే దొరసానివి దేవి
విశ్వరూపిణి విశేష శక్తిని ॥అమ్మా॥
వచ్చి మెచ్చి హెచ్చుగా నన్నేలుకొమ్మా
అమ్మా! ఓయమ్మా! రావమ్మా లలితమ్మా
ఆశ్రిత భక్త సుపాలిని భవానీ
అమ్మా! అమ్మా! ఓయమ్మా రావమ్మా ॥అమ్మా॥

...కవితా రచన
గంగరాజు
సెల్ నెం: 9866765232

## పంచాంగం

మాసం : నిజ జ్యేష్ట ; తిథి : బహుళ పాడ్యమి ఉ.8.03; పూర్వాషాడ మ.2.25; రా.వ.11.16ల 1.03.

శుక్రవారం 29-06-2018

**మేషం** : గృహమునకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. దంపతుల మధ్య సఖ్యత నెలకొంటుంది. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళు, ప్రలోభాలకు పోకుండా ఏకాగ్రతతో పని చేయవలసి ఉంటుంది. స్త్రీలకు ముఖ్యుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆలయాలను సందర్శిస్తారు.

**వృషభం** : విద్యార్థులకు పోటీ పరీక్షల ఏకాగ్రత, సమయపాలన అవసరం. ఖాదీ, పట్టు, చేనేత, కలంకారీ వస్త్ర వ్యాపారులకు ఆటుపోట్లు తప్పవు. ఉపాధ్యాయులకు ఒత్తిడి, చికా కులు అధికమవుతాయి. స్త్రీలు ఇతరులతో మితంగా సంభాషించటం క్షేమదాయకం. ఉద్యోగస్తులకు అధికారుల నుండి ఒత్తిడి, పనిభారం అధికమవుతాయి.

**మిధునం** : వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. ఏ విషయంలోను ఇతరులపై ఆధారపడక స్వయంకృషినే నమ్ముకోవడం మంచిది. ప్రేమికులకు పెద్దల నుండి వ్యతిరేకత, ఇతర్రతా చికాకులు అధికమవుతాయి.

**కర్కాటకం** : మీ సంతానం పరీక్షల పట్ల శ్రద్ధ వహిస్తారు. ఆడిటర్లకు ఒత్తిడి, కాంట్రాక్టర్లకు లాభదాయకం. ఏ విషయంలోను నిరుత్సాహం చెందక అంతా మంచికేనని సర్దుకుపోవటం శ్రేయస్కరం. ఎల్.ఐ.సి పోస్టల్ ఏజెంట్లకు ఒత్తిడి, స్పెక్యులేషన్ రంగాల వారికి చికాకులు తప్పవు. బంధువుల మధ్య సయోధ్య నెల కొంటుంది.

**సింహం** : విద్యార్థులకు ఏకాగ్రత వల్ల అభివృద్ధి పొంద గలుగు తారు. కొత్త సమస్యలు తలెత్తె అవకాశం ఉంది. మెళుకువ వహించండి. మీ మాటకు సంఘంలోనూ, కుటుంబములోనూ ఆమోదం లభిస్తుంది. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదని గమనించండి. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు.

**కన్య** : స్త్రీలతో సంభాషించునపుడు సంయమనం పాటించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు ఏకాగ్రత ముఖ్యం. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనాలు తలకిందులవుతాయి. ప్రముఖులను కలుసుకుంటారు

**తుల** : కాంట్రాక్టర్లకు రావలసిన ధనం అందడంతో నిర్మాణ పనులు వేగవంత మవుతాయి. ఎదుటివారితో ఎలా మాట్లాడినా తప్పుగానే భావిస్తారు. విద్యార్థులకు చదువుతో పాటు ఇతర్రతా ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఇతరులకు వాహనం ఇచ్చేటపుడు లౌక్యం పాటించండి.

**వృశ్చికం** : ఎదుటివారి విషయాలలో జోక్యం చేసుకోవటం వల్ల మాటపడక తప్పదు. స్త్రీలు గత కొంత కాలంగా అనుభవిస్తున్న సమస్యలు పరిష్కారం కాగలవు. పచారీ, ఫ్యాన్సీ, హోటల్, తినుబండారాలు, క్యాటరింగ్ పనివారలకు పురోభివృద్ధి. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళకు లొంగకుండా స్థిరచిత్తంతో వ్యవహరించవలసి ఉంటుంది.

**ధనుస్సు** : కొంతమంది మీ నుండి ధనసహాయం ఆశించవచ్చు. వైద్యులకు చురుకు ధనం, ఆడిటర్లకు ఒత్తిడి, లాయర్లకు కలిసివచ్చే కాలం. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేస్తారు. రాజకీయనాయకుల కదలికలపై విద్రోహులు కన్నేసిన విషయం గమనించండి.

**మకరం** : ఉపాధ్యాయులకు ఒత్తిడి, అక్కౌంట్స్ రంగాల వారికి పనిభారం తప్పవు. స్త్రీలకు శ్రమాధిక్యత, మానసికాందోళనల వల్ల ఆరోగ్యము మందగిస్తుంది. చిన్నతరహా, కుటీర పరిశ్రమల వారికి ప్రోత్సాహకరం.ప్రముఖులను కలుసు కుంటారు.దైవ, పుణ్య కార్యాక్రమాల పట్ల చురుకుగా పాల్గొంటారు.

**కుంభం** : స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధికమవు తాయి. ఉద్యోగస్తుల తొందరపాటు చర్యలు, నిర్లక్ష్యం వల్ల కొత్త సమస్య లెదుర్కోవలసి వస్తుంది. పత్రిక రంగాల్లో వారు, రచయితలు ఆశించే మర్పులకోసం కొంత కాలం వేచియుండక తప్పదు.

**మీనం** : బ్యాంకు వ్యవహారాలు, ప్రయాణాల్లో మెలకువ వహించండి. ఎదుటి వారితో సంభాషించేటపుడు మెలకువ వహించండి. గృహంలో మార్పులు, చేర్పు

## ర్యాలి క్షేత్రానికి అందుకే ఆ పేరు వచ్చిందట!



శ్రీమహావిష్ణువు లోక కల్యాణం కోసం ధరించిన రూపాలలో జగన్మోహిని రూపం ఒకటి. దేవతల నుంచి అమృతాన్ని దక్కించు కోవడానికి అసురులు ప్రయత్నిస్తూ వుండగా, వాళ్లకి అమృత భాండం చిక్కకుండా చేయడం కోసం స్వామి జగన్మోహిని రూపాన్ని ధరించాడు. అలా స్వామి తాను అనుకున్న కార్యాన్ని పూర్తిచేసిన తరువాత, పరమశివుడి కంటపడతాడు. జగన్మోహిని సౌందర్య విశేషం సదాశివుడిని ఆశ్చర్యచకితుడిని చేస్తుంది. విష్ణు మాయ కారణంగా ఆకర్షితుడైన శివుడు .. జగన్మోహినిని అనుసరి స్తాడు. ఆయన వెంబడిస్తుండటం గమనించిన జగన్మోహిని తన నడక వేగాన్ని పెంచుతుంది. అలా హడావిడిగా ఆమె వెళుతూ వుండగా ఆమె తలలో తురుముకున్న పుష్పం ఒకటి 'రాలి' పడిపోతుంది. లోక కల్యాణం కోసం వచ్చిన జగన్మోహిని తలలోని పుష్పం 'రాలి' పడిన ప్రదేశం కనుక, ఈ ప్రదేశానికి 'ర్యాలి' అనే పేరు వచ్చిందననేది ఒక కథగా చెబుతారు. ఒకే మూలమూర్తికి ముందు భాగంలో కేశవస్వామి దర్శనమిస్తూ ఉండగా, వెనుక భాగంలో జగన్మోహిని రూపం కనిపిస్తుంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఆత్రేయపురం మండలం పరిధిలో ఈ క్షేత్రం అలరారుతోంది. అత్యంత ప్రాచీనమైన ఈ క్షేత్రాన్ని దర్శించడం వలన, విశేషమైన ఫలితాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

## చెన్నకేశవస్వామి మహిమ!



శ్రీమహావిష్ణువు .. శ్రీచెన్నకేశవస్వామిగా ఆవిర్భవించిన క్షేత్రాలలో ఒకటిగా 'ఉల్లిపాలెం' కనిపిస్తుంది. కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని మహిమాన్వితమైన క్షేత్రాలలో ఇది ఒకటిగా వెలుగొందుతోంది. 'నగరం' మండలంలోని ఈ క్షేత్రంలో శ్రీ భూ నీలాదేవి సమేత చెన్నకేశవస్వామి పూజాభిషేకాలు అందుకుంటూ వస్తున్నాడు. ఇక్కడ స్వామి కొలువుదీరడం వెనుకనే ఆయన మహిమ ఎంతటిదో తెలుస్తుంది. పూర్వం ఇక్కడి గ్రామంలోని జమీందారుకి కలలో స్వామివారు కనిపించి తన జాడ తెలియజేసి, తనని ఈ గ్రామంలో ప్రతిష్ఠించి పూజించమని చెప్పాడట. అయితే ఇది సాధారణమైన కలే అనుకుని ఆయన తన దైనందిన కార్యక్రమాల్లో నిమగ్నమై వున్నాడు. దాంతో మరుసటి రోజు రాత్రి ఆయనకి స్వామి మళ్లీ స్వప్నంలో కనిపించడమే కాకుండా, తాను చెప్పిన విషయాన్ని మరోమారు గుర్తుచేశాడట. అంతేకాకుండా వెంటనే తన మూర్తిని ఆ గ్రామానికి తరలించమంటూ తట్టి లేపాడట. అప్పుడు ఆయన ఆ పనికి పూనుకుని 'అల్లపర్రు'లోని స్వామివారి ప్రతిమను 'ఉల్లిపాలెం' చేర్చారట. అలా స్వామి తమ గ్రామానికి కోరి వచ్చాడు కనుక, ఇక్కడి ప్రజలంతా స్వామిని తమ ఇష్టదైవంగా భావిస్తుంటారు. అనునిత్యం ఆ స్వామిని కొలుస్తూ తరిస్తుంటారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## ఎనిమిది మందుల దుకాణాలకు నోటీసులు

విజయనగరం: ఔషధ నియంత్రణ పరిపాలన సిబ్బంది ఈ నెల 26వ తేదీన గజపతినగరంలోని రిటైల్ మందుల దుకాణాలపై తనిఖీలు నిర్వహించిందని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ సహాయ సంచాలకులు ఎ.టి.రమాదేవి తెలిపారు. విజయనగరం, బొబ్బిలి ఔషద తనిఖీ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఈ తనిఖీల్లో ఔషధ నియంత్రణ చట్టం 1940 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించిన ఎనిమిది దుకాణాలకు నోటీసులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు.

## సమష్టి భావాల సమాగమం తెలుగు సంస్కృతి - బాలా త్రిపురసుందరి



విజయనగరం : సమష్టి భావాల సమాగమం తెలుగు సంస్కృతి అని స్పెషల్ డిప్యూటీ కలక్టర్ బాలా త్రిపురసుందరి అన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఫేజ్-2 ఉడా కాలనీలో గల మండల పరిషత్ ప్రాధమిక పాఠశాలలో ముళ్లపూడి వెంకటరమణ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ కేవలం 14 ఏళ్ల వయస్సులో కథలు, శతక పద్యాలు రాసే స్థాయికి ఎదిగిన ముళ్లపూడి తదనంతరం బాపుతో కలసి తెలుగు భాషకు, తెలుగుదనానికి, తెలుగు సినిమాకు పట్టంగట్టారని అన్నారు. అనంతరం నా ఊరు విజయనగరం సంస్థ వ్యవస్థాపకురాలు గుమ్మలూరి విశాలాక్షి సౌజన్యంతో పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్, ఉపాధ్యక్షులు పిన్నింటి సూర్య నారాయణ, 28వ వార్డు కౌన్సిలర్ పిన్నింటి కళావతి, మమ్ముల తిరుపతి రావు, ముడిదాపు రాము, ఎస్ అక్రమ్, సి హెచ్ త్రినాథరావులతో పాటు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు కె.మాధురి, ఎ.తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

## నూతన చేతి బోరు ప్రారంభం



కంచరపాలెం : జీవీఎంసీ 41 వ వార్డు పరిది తుమ్మడిపాలెం జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన చేతి బోర్ ను టీడీపి 41 వ వార్డు అద్యక్షుడు పెంటకోట త్రినాథరావు గురువారం ఉదయం ప్రారంబించారు. ఇప్రాంతంలో నూతన చేతి బోర్ ఏర్పాటు చేయడంవలన ఇక్కడి ప్రజలకు మంచినీటి కష్టాలు తీరతా యన్నారు. కార్యక్రమంలో కార్తీక్ కుట్ట , నాగల అప్పల రాజు , పి.వి.రమణ, పి.అప్పరావు, పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీమన్నార్‌లో జేష్ఠాభిషేకాలు



విజయనగరం: స్థానిక కొత్తపేట శ్రీమన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో జేష్ఠపూర్ణిమ సందర్భంగా గురువారం శ్రీజగన్నాధ స్వామి వారికి జేష్ఠాభిషేకాలు నిర్వహించారు. భక్తులు శ్రీబలబద్ర, సుబద్ర, జగన్నాధస్వామి వారికి పూజలు జరుపుకున్నారు. స్వామి వారి తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు..

## వైభవంగా అప్పన్న మూడవవిడత చందన సమర్పణ



సింహాచలం : శ్రీ సింహాద్రి అప్పన్నకు జేష్ఠ పౌర్ణమి పురస్కరించుకుని మూడవ విడత చందన సమర్పణ సింహ గిరిపై వైభవంగా జరి గింది ముందుగా స్వామిని సుప్రబాత సేవ మేల్కొల్పి అనంతరం స్వామికి ముందుగా వనమూలిక సుగందద్రవ్య మిళితమైన చందనాన్ని అప్పన్నకి అర్చక స్వాములు వైదిక సాంప్రదాయ ప్రకారం సమర్పించారు అనంతరం ప్రత్యేకపూజలు జరిపి గురువారాన్ని పురస్కరించుకుని స్వామి ని నరసింహ స్వర్ణకవచ అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు మరో వైపు పౌర్ణమి పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున ఆలయ ప్రదిక్షణలో పాల్గొన్నారు వకవైపు చందన సమర్పణ మరో వైపు పౌర్ణమి పురస్కరించుకుని భారీ ఎత్తున సింహగిరికి భక్తులు చేరుకున్నారు.

## జగన్నాథునికి జ్యేష్టాభిషేకాలు



భీమునిపట్నం : స్థానిక మెయిన్ జగన్నాథ స్వామి గుడిలో ప్రతీ ఏడాది జగన్నాథ స్వామివారి రథయాత్ర మహోత్సవాలు ప్రారంభానికి పక్షం రోజులు ముందు గా జేష్ట పౌర్ణమి నాడు స్వామివారికి జేస్టాభిషెకాలు నిర్వహిస్తామని వంశపారంపర్య ఆలయపూజారి రోంపిచర్ల సింగరాచార్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఆలయంలోని బలబద్ర, సుబ్రద, జగన్నాథ స్వామి విగ్రహలను బయటకి తిసుకొని వచ్చి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు పంపిణి చేశారు.ఈ కార్యక్రమం లో అధిక సంఖ్య లో భక్తులు పాల్గొన్నారు.అలాగే భీమిలి కృష్ణా కోలనిలో ఉన్న వెంకటేశ్వర స్వామి జేష్ట పౌర్ణమి సందర్భంగా స్వామి వారి కి అభిషేకాలు నిర్వహించారు.భక్తులకు తీర్ధ ప్రసాదాలు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం కు ఆలయ ప్రధాన అర్చకులు జి.వి.అప్పలాచార్యులు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రేలంగి పెదబాబు, ముత్యాలరావు ,జి.సన్యాసిరావు, ,విశ్రాంతి సబ్ రిజిస్టర్ కె. రామకృష్ణ, కొక్కిరి అప్పన్న భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## న్యాయవాదుల సంక్షేమమే ప్రధాన ధ్యేయం




విశాఖపట్నం: న్యాయవాదుల సంక్షేమం, వృత్తి భద్రత ప్రధాన ధ్యేయంగా రాష్ట్రవ్యాప్త న్యాయవాదుల ప్రయోజనాలకై కృషి చేస్తానని విశాఖపట్టణంనకు చెందిన సీనియర్ న్యాయవాది, ఎపి స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికల పోటీ అభ్యర్థి బైపా అరుణ్‌కుమార్ అన్నారు. ఈయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సమర్ధులైన, కార్యశీలురైన న్యాయ వాదులను గెలిపించి, బార్ కౌన్సిల్‌కు పంపాల్సిన బాధ్యత న్యాయ ంవాదులపై వుందని పేర్కొన్నారు. విశాఖ నుంచి సుమారు 2,650 మంది న్యాయవాదులు ఓటు హక్కు వినియోగించు కోను న్నారని, రాష్ట్రంలోనే అత్యధికంగా విశాఖ నుంచి 29మంది అభ్య ర్థులు పోటీ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాకా సత్యన్నారాయణ, గుడిపల్లి సుబ్బారావు, బోసుబాబు, ఐజాక్‌బాబు, పైలా శ్రీనివాసరావు, కదిరి రాము, వాగుపల్లి చిన్నారావు, పి.శ్యామ్‌బాబు, పి.చలపతి, కె.ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.




NEELAM
COMPUTER BAZAR
47-15-4, Above Vagdevi Book Store, 1st Floor Dwarakanagar,
VISAKHAPATNAM - 530 016. Website : neelamcomputerbazar.tk

## ఎల్లమ్మపేటలో హెల్త్ క్యాంపు



భీమునిపట్నం : డెంగ్యూ వ్యాధి గ్రస్థులు వెంటనే చికిత్స చేయించుకోవాలని భీమిలి ఎంపిపి యరబాల కృష్ణవేణి అన్నారు. ఆమె ఆధ్వర్యంలో గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగ్యూ జ్వరాలతో బాధ పడుతున్నవారికి చికిత్సలు నిర్వహించారు ఇంకా ఇలాంటి లక్షణాలు ఎవరికైనా ఉన్నట్లు అనిపించిన వెంటనే చికిత్స తీసుకోవాలని సూచించారు.గ్రామంలో దోమలు నివారణ నిమిత్తం మందును గ్రామం లో అన్ని వీధుల్లో వేయించారు, ప్రజలు చికిత్స కోసం వచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో, వైద్యులు వెంకటలక్ష్మి,సత్యవతి, సర్పంచ్ సమ్మిడి శ్రీను, యరబాల అనీల్ ప్రసాద్, ఎఎన్‌ఎం సూర్యమణి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాను విస్మరించి..కడప పరిశ్రమకు సంతకాలా?

### అశోక్‌పై చిన్న శ్రీను చిర్రు బుర్రులు



విజయనగరం: జిల్లాలోను, ఉత్త రాంధ్రలోను నెలకొన్న అనేక సమస్య లపై స్పందించని కేంద్ర మాజీమంత్రి, పార్లమెంటు సభ్యులు అశోక్ గజపతి రాజు ఎక్కడో ఉన్న కడప ఉక్కు పరి శ్రమ కోసం సంతకాల సేకరణ చేయడం హాస్యాస్పదంగా ఉందని జిల్లా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాజకీయ వ్యవ హారాల సమన్వయకర్త మజ్జి శ్రీనివాస రావు(చినశ్రీను) ఎద్దేవా చేశారు. గురువారం స్థానిక సత్యా కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడున్నర సంవత్సరాలు కేంద్రమంత్రిగా పనిచేసిన ఆయన ఎన్నడైనా రాష్ట్ర విభజన హామీలకోసం, ప్రత్యేకహెూదా కొరకు మాట్లాడారా? విశాఖ రైల్వేజోన్ కోసం స్పందించారా ? అని అశోక్‌ను ప్రశ్నించారు. కడప ఉక్కు - ఆంధ్రుల హక్కు అని నినదిస్తున్న అశోక్ ఉత్తరాంధ్ర ప్రాంత గిరిజనుల హక్కు - గిరిజన యూనివర్సిటీ అని ఎందుకు నినదించరని నిలదీశారు.ఉత్తరాంధ్ర ప్రజల సమస్యలు మీకు పట్టవా? అని దుయ్యబట్టారు. జిల్లాకు ప్రభుత్వం ప్రకటించిన ప్రభుత్వవైద్య కళాశాలను అశోక్ ఎందుకు వద్దన్నారో ప్రజలకు చెప్పాలన్నారు.కడప ఉక్కు పరిశ్రమ కోసం మాట్లాడుతున్న అశోక్‌గజపతిరాజు జిల్లాలో మూతపడిన జ్యూట్, ఫెర్రో పరిశ్రమలు తెరిపించాలని ఎందుకు అనుకోరని కేంద్రమంత్రిగా జిల్లాకు ఏవైనా పరిశ్రమలు తెచ్చారా అని నిలదీశారు. ఈ జిల్లాకు ఉపయోగపడే ఒక మంచి పనైనా ఆయన చేశారా అని శ్రీనివాసరావు అన్నారు. బొత్స సత్యనారాయణ నాడు మంత్రిహెూదాలో రైతుల నుండి విలువైన భూములు సేకరింప జేసిన కృషితో దివంగత ముఖ్యమంత్రి డా॥ రాజశేఖరరెడ్డి విజయనగరం పట్టణ ప్రజల దాహార్తి తీర్చేటందుకు, రైతులకు సాగునీరుకు తారక రామతీర్థసాగర్ ప్రారంభించి యాబైశాతం పనులు చేస్తే ఆ మిగిలిన పనులు మీ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ఆయన అశోక్‌ను నిలదీశారు. భోగాపురం విమానాశ్రయం ఏర్పాటుకు ఆ ప్రాంత రైతులు కోట్లాది రూపాయలు విలువైన భూములు ఇస్తే ఆశాఖ మంత్రిగా పనిచేసిన మీరు భోగాపురం విమానాశ్రయం మాహక్కు అని మీరు నినాదం చేయలేదని శ్రీనివాసరావు ప్రశ్నించారు.ఈ జిల్లా ప్రజలు మీకు ఓటు వేసిన పాపానికి ప్రజలకు మీరు ఇంతటి శిక్ష విధిస్తారా అని ఆయన ఆగ్రహించారు. మీ అధికార దర్పాణికి పట్టణంలోని సంతకాల వంతెన ప్రారంభం కాలేదని ఆయన విమర్శించారు. మీరు ఉత్తరాంధ్ర ప్రజలను బానిసలుగా భావిస్తున్నారని త్వరలో ప్రజలు బుద్ది చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని శ్రీనివాసరావు హెచ్చరించారు.

ఈ సమావేశంలో డిసిసిబి ఉపాధ్యక్షులు చనమల్లవెంకటరమణ, మార్క్‌ఫెడ్ డైరెక్టరు కె.వి.సూర్య నారాయణరాజు, జిల్లా నాయకులు పిళ్ళా విజయకుమార్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి అవనాపు విజయ్, పార్వతీపురం నియోజకర్గం సమన్వయకర్త అలజంగి జోగారావు, మాజీ ఎం.పి.పి.గొరపల్లి జయప్రకాష్, ముల్లు త్రినాధ్‌లు పాల్గొన్నారు.

# పధకాల లబ్ధిలో అవినీతికి తావివ్వద్దు

### రాష్ట్ర షెడ్యూల్డ్ కులముల సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ జూపూడి ప్రభాకరరావు



విజయనగరం: ప్రభుత్వం దళితులకు, అందరి పేద ప్రజానీకానికి అందించే పలు సంక్షేమ పథకాల లబ్ధిపొందుటలో నీతిగా నిలబడి, అవినీతిని ఎదుర్కొనే ధైర్యాన్ని దళితులు మరియు అందరు పేదు అలవరుచుకోవాలని అప్పుడే అవినీతి రూపుమాసిపోతుందని రాష్ట్ర షెడ్యూల్డ్ కులముల సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ జూపూడి ప్రభాకరరావు అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ హాల్‌లోఎస్.సిలబ్దిదారుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. దళితులు అందరితో సమానంగా వెళ్ళాలని ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తు 2017లో 2,513 కోట్ల రూపాయలు వెచ్చించిందని అన్నారు. ఇందులో 50కోట్లు జిల్లాకు కూడా అంద జేశామన్నారు. నైపుణ్యం మరియు ఉద్యోగ కల్పనకు ఎస్.సి కార్పొరేషన్ అనేక చర్యలు తీసుకున్నాదని తెలిపారు. దళితులు తమకు మేలు చేసే వారిని మరవరని తెలిపారు. భూమి ఉన్నప్పుడే దళిత రైతు లలో ఆత్మాభిమానం పెరుగుతుందని, ఇందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో 500 కోట్లుతో భూములు కొనుగోలు చేసి అందజేస్తా మన్నారు. దళితుల సంక్షేమానికి ఈ ఏడాది 300 కోట్లు వెచ్చిస్తున్నామని తెలియజేశారు. కార్లతో సహ 630 ట్రాక్టర్లు అందజేశామన్నారు. పంచాయితీరాజ్ శాఖతో సమన్వయమై 10,000 ట్రాలీలు అందజేశా మని వివరించారు. న్యాయంగా రుణాల రూపేణా ప్రభుత్వం అందజుస్తున్న రుణాలు మంజూరులో అధికారులు ఎట్టి అవినీతికి తావివ్వరాదని హెచ్చరించారు. సమా జంలో ఎనలేని అవినీతికి పాల్పడి శిక్షలు అనుభవించినవారే జరుగుతున్న అభివృద్ధిని వ్యతిరేక ధోరణితో చూసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దళితులు, విజ్ఞులైన ప్రజలు దీనిని గమనించాలని కోరారు. కార్పరేషన్ మేనేజింగ్ డైరక్టర్ సునీల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ గత రెండేళ్ళుగా దళితులకు ప్రభుత్వం ఎన్నడు లేని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాదని తెలిపారు.రాష్ట్ర మహిళా సంఘం సభ్యురాలు శ్రీవాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి దళితుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తూ ఎనలేని సహకారం అందిస్తున్నారని అన్నారు. ఈ కార్య క్రమాన్ని ముందుగా బాబా సాహెబ్ అంబెద్కర్, బాబూ జగ్జీవన రావు చిత్రపఠాలను జూపూడి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వ లనంతో ప్రారంభించారు.

## ఆంత్రాక్స్, డెంగీ, మలేరియా పై ఐఏఎస్‌లకు వినతి

నర్సీపట్నం : విశాఖపట్నం మన్యంలో ఆంత్రాక్స్, డెంగీ, మలేరియా బారిన పడి గిరిజన ప్రజానీకం మరణిస్తున్నారని ఆసుపత్రులలో తగిన సంఖ్యలో వైద్యులు, స్పెషలిస్ట్‌లు లేరని సరైన వైద్య సదుపాయం అందక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని దీనిపై తగు చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్‌ఎస్.రావత్, ఐఎఎస్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ గంధం చంద్రుడు,ఐఏఎస్‌లను ఆంధ్రప్రదేశ్ సచివాలయం, అమరావతిలో కలసి విజ్ఞాపన పత్రం ఇచ్చినట్లు భారతీయ ఆదివాసుల సమాఖ్య అధ్యక్షుడు గడుతూరి రాంగోపాల్ తెలిపారు. మన్యం లోని గిరిజనులకు మెరుగైన వైద్య సదుపాయం కల్పనకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, త్వరలో పూర్తి స్థాయిలో డాక్టర్‌లను భర్తీ చేస్తామని చెప్పారు. జవహర్ నవోదయ విద్యాలయం విశాఖపట్నం మన్యంలో ఏర్పాటుకు భూమి కేటాయించి త్వరలోనే నిర్మాణ పనులు చేపట్టనునట్లు వారు తెలిపారని అన్నారు.



మండలంలో వెంకుపాలెం గ్రామంలో గురువారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజర య్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొణతాల శ్రీను, రాపేటి రాము, మళ్లసురేంద్ర, నడిపల్లి గణేష్, పంచదార్ల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీలోకి కొణతాల సీతారాం



అనకాపల్లి : పట్టణంలో యువ పారిశ్రామిక వేత్త కొణతాల సీతారాం విశాఖపట్నం పర్యటనలో ఉన్న, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గురువారం పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు అనకాపల్లి నుండి సుమారు 200 మంది అభిమానులతో భారీ ర్యాలీగా తరలి వెళ్లారు. ఈసందర్భంగా సీతారాం మాట్లాడుతూ పవన్ కళ్యాణ అనకా పల్లి పర్యటనకు వచ్చే సమయానికి కార్యా లయం సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు జనసేన పార్టీ కార్యా లయం ఏర్పాటుకు మండల పార్టీ నాయకు లతో కలిసి సన్నహాలు ప్రారంభించారు. పట్టణంలో ఎన్టీఆర్ స్టేడియం పక్కన, అపోలో మెడికల్ సెంటర్ దిగువ అంతస్థులో భవనాన్ని, జనసేన పార్టీ కార్యాలయంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు.

నియోజక వర్గంలో జనసేన నాయకులు, సీతారామ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం పనులు జరుగుతున్నాయి.

RAMANUJAN & RAMAN
Dwarakanagar- Gopalapatnam-Sujathanagar
98850 80592
OFFERS COACHING for
IIT - NEET - BITSAT

CHANGE OF NAME
I, SRINIVASA REDDY VEMPADA, S/o. Late Vempada Poli Reddy, residing at Door No.4-25-9, M.V.Street, Peda Waltair, Visakhapatnam-530017. My Wife's Name, Date of Birth was wrongly mentioned in my office Document. Instead of mentioning my Wife's Correct Name as VEMPADA VENKATA LAKSHMI if was mentioned wrongly as VENKATA LAKSHMI and also my Wife's Correct Date of Birth is 20-03-1987 it was mentioned wrongly as 19-03-1986. Hence, I request to Correct my Wife's Name and Date of Birth in my Service Records.

# రైతులకు ఖరీఫ్‌లో వడ్డీ లేని రుణాలు అందించాలి

## సిపిఎం నాయకులు డిమాండు




దేవరాపల్లి : ఖరీఫ్ రైతులకు సరిపడా విత్తనాలు అందజేసి, పెట్టుబడుల కోసం వడ్డీ లేని ఋణాలు మంజూరు చేయలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న, పార్టీ మండల కార్యదర్శి సి హెచ్ రాజు ప్రభుత్వాన్ని డిమండ్ చేశారు. స్థానిక సి ఐ టి యు కార్యాలయంలో గురువారం రైతులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా వారు మట్లాడారు ప్రతి ఏడాది సీజన్ రాగానే రైతులు విత్తనాల కోసం పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడు దుందన్నారు .అష్టకష్టాలు పడి విత్తనాల వేసిన రైతులు పెట్టుబడుల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగున అప్పులు ఇవ్వడం లేదని అవేదన వ్యక్తం చేశారు. రైతులకు, కౌలు రైతులకు వడ్డీ లేని ఋణాలు ఇస్తామన్న ప్రచారం ప్రకటనలకే పరిమితమైందన్నారు. నాన్ షెడ్యూల్డ్ ఏరియా లో గిరిజనులకు ఇంకా విత్తనాలే పంపిణీ చేయలేదన్నారు.

తీరా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పాటు దళారులు దోచుకుతింటున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడే విత్తనాలు అందించటంతో పాటు ఋణాలు ఇచ్చి, ఎరువులు -పురుగుల మందులపై జి ఎస్ టి ని ఎత్తివేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కె .కోటపాడు పార్టీ మండల కార్యదర్శి జి .చింతలూ ,కర్రి దేముడు ,జానా సన్నిబాబు తదితరులు పాల్గోన్నారు

# దళిత క్రైస్తవులను ఎస్సీలుగా ప్రకటించాలి

## సివైఎఫ్ జాతీయ అధ్యక్షులు మూర్తిరాజు

కాకినాడ : దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించి 13 జిల్లాల కోటి మంది దళితుల హృదయాలు దోచుకావాలని సివైఎఫ్ జాతీయ అధ్యక్షులు బిహెచ్‌వి మూర్తిరాజు కోరారు. గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడు తూ రాజ్యాంగంలో కల్పించబడిన మత స్వాతంత్ర్యపు హక్కును కాపాడాలన్నారు. దళితు లు క్రైస్తవ్యాన్ని అనుసరిస్తే వారి రిజర్వేషన్‌ను రద్దుచేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నిం చారు. క్రైస్తవులపై నానాటికీ దాడులు పెరిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వీటికి వ్యతిరేకంగా ప్రత్యేక జివో అమలు చేయాల న్నారు. పంచాయతీ అనుమతులతో చర్చి నిర్మించుకొనే విధంగా అనుమతి ఇవ్వాలన్నారు. కాకినాడ టౌన్, రూరల్ ప్రాంతాలలో ఒక కమ్యూనిటీ హాలు నిర్మించాలన్నారు. క్రైస్తవ మిషనరీలు నిర్మించిన ఆసుపత్రులు, విద్యాల యాలు, భూములు, అన్యాక్రాంతం అవుతున్నా యని వీటి పరిరక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆయన కోరారు. క్రైస్తవులకు చట్ట సభలలో ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. తమ డిమాండ్లను ధర్మ పోరాట దీక్షలో పరిశీలించి క్రైస్తవులకు న్యాయం చేయాలని కోరారు.

# విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ



అమలాపురం : ఉప్పలగుప్తం మండలం ఎంపిపియుపిఎస్ కూనవరం నందు ఉచిత పాఠ్యపుస్తకాలు, దాతల విరాళాలతో స్కూల్ బ్యాగ్‌లు, డైరీల పంపిణీ కార్యక్రమం గురు వారం జరిగింది.

పాఠశాల ప్రధానో పాధ్యా యులు కెఎస్ఆర్. హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూనవరం సర్పంచ్ పండు వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు ఊటాల సుగుణామణి, చిరంజీవ నర్సింగ్ హోం అధినేత బి.రాధమ్మ, మండల విద్యాశాఖాధికారి ఆకుల మంగాపతి రావు, ఎస్ఎంసి చైర్మన్ ఆకుల సత్తిరాజు, గ్రామపెద్దలు ఆకుల తాతారావు, సుందరనీడి ఏసుబాబు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లు, డైరీలు అందజేశారు.

ఈ సందర్భంగా దాతలైనా గిరిప్రియ సిమెంట్స్ అండ్ ఐరన్ అమలాపురం, చిరంజీవ నర్సింగ్ హోం అధినేత బి.రాధమ్మ, సుబ్రహ్మణ్యం మెడికల్ షాపు కూనవరం వారిని పలువురు వక్తలు అభినందించారు.

# కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలు

పెద్దాపురం : కాపు కార్పొరేషన్ ద్వారా, కాపు, ఎస్‌సి., బిసి వర్గాలకు పెద్దాపురంలో గల ఎస్‌బిఐ, ఎడిబి, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులు రుణాలు మంజూరుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయా బ్యాంకుల మేనేజర్లు తెలిపారు. ఎస్‌బిఐ-ఎడిబి కి గాను కట్టమూరు, ఆర్.బి.పట్నం, ఆర్.బి. కొత్తూరు గ్రామాల నుండి స్వయం సహాయక రుణాలు పొందడానికి సుమారు 300 మంది 26న, 300 మంది 27న ఇంటర్వ్యూలకు రావడం జరిగిందని బ్రాంచి మేనేజర్ ఎం.ఎన్.జి కృష్ణ తెలిపారు. అర్హులైన వారికి ఎస్‌బిఐ వ్యవసాయ శాఖ (ఎడిబి) బ్యాంకు రుణాలు మంజూరుచేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు పెద్దాపురం బ్యాంకు నుండి గండేపల్లి, సూరం పాలెం, యల్లమిల్లి, మండలాలనుండి కాపులు 268, బిసిలు 106 ఎస్‌సీలు 42 మంది రుణాల కొరకు ఇంటర్వ్యూలకు రావడం జరిగిందని బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ తెలిపారు.

# ఉత్సహంగా ఒలింపిక్ రన్

తాళ్లరేవు: ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఇచ్చిన భాగంగా తాళ్లరేవులో ఒలింపిక్ రన్ ఉత్సాహంగా నిర్విహించారు. జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జడ్‌పిటిసి పొన్నమండ రామలక్ష్మి జెండాఊపి ప్రారంభించారు. ఒలింపిక్ క్రీడాజ్యోతిని పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ టేకుమూడి లక్ష్మణరావు విద్యార్థులకు అందచేశారు. జడ్‌పి హైస్కూల్ నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు ఈ రన్ సాగింది. ఈ సందర్బంగా జరిగిన సభలో రామలక్ష్మి మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడయొక్క ప్రాముఖ్యతను గ్రామగ్రామాన చెప్పవలసి ఉందన్నారు. అందులో భాగంగా ఒలింపిక్ దినోత్సవ సందర్భంగా ఈ రన్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ రన్‌లో పాల్గొన్న నాయకులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు దృవపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాసు, ఎంపిటిసి మేడి సెట్టి సత్తిబాబు, మండల కోఅప్షన్ సభ్యుడు ఇ. సత్యనారాయణ, పిఇటిలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్యలో అడ్వాన్స్ ఇన్ ఎలక్ట్రికల్ డ్రైవ్స్ పై అవగాహన సదస్సు

కాకినాడ/ గండేపల్లి : సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ట్రిపుల్‌ఈ డిపార్ట్మెంట్ మూడవ మరియు నాల్గవ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్ధులకు అడ్వాన్స్ ఇన్ ఎలక్ట్రికల్ డ్రైవ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కెఎల్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ ఓ.చంద్రశేఖర్ ముఖ్య అలిదిగా విచ్చేసి విద్యార్ధులకు అవగాహన కల్పించారు. ఈసదస్సులో అధునాతన యాంత్రీకరణ విద్యను వినియోగించి విద్యార్థులు నైపుణ్యం ఏవిధంగా అభివృద్ధి చేసుకోవాలో వివరించారు.ఈ కార్యక్రమాన్ని కళాశల ప్రిన్సిపాల్ ప్రొ.ఏ.రమేష్ ప్రారంభించి విద్యార్థులు ఎప్పటికప్పుడు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని ట్రిపుల్ ఈ విభాగాధిపతి కె.మనోజ్ కుమార్ రెడ్డి పర్యావేక్షింణలో ట్రిపుల్ ఈ అధ్యాపక బృందం, అధిక సంఖ్యలో విద్యార్ధులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా దుర్గమాంబ పండుగ



పరవాడ: మండల కేంద్రమైన పరవాడ గ్రామంలో గురువారము శ్రీశ్రీశ్రీ దుర్గమాంబ అమ్మవారి పండగ వైభవంగా జరిగింది. చుట్టుప్రక్కల గ్రామల చెందిన భక్తులు వేకువజాము నుండే ఆలయం వద్దకు భక్తులు చేరుకొని ఆమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసిపి రాష్ట సిఇసి సభ్యులు పైల శ్రీనువాసురావు, పైల పోతినాయుడు (పెద్దింటి), పైల రామచంద్రరావు, పైలహరేష్ , బండారు రామారావు, చుక్క సన్యాశిరావు తదితరులు అమ్మవారిని దర్మించుకుని ప్రత్యేక పూజలు చేసారు, సాయంత్రము సాముగరిడీలు, కోలాటాలు, చిడతలు, చిటికెల భజనలు, ప్రజలను ఆకట్టుకున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజలతో గ్రామం కిక్కిరిసింది. సందర్బంగా ఏర్పాటు చేసిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

## దేవరాపల్లి తహసీల్దారుగా రమేష్ బాబు

దేవరాపల్లి : మండల తహశీల్దారుగా జె .రమేష్ బాబు గురువారం భాద్యతలు చేపట్టారు. ఈయన జిల్లా లోని పద్మనాభం మండల డిప్యూటీ తహశీల్దారుగా పని చేస్తూ పదోన్నతిపై తహశీ ల్దార్ హోదాలో దేవరాపల్లి వచ్చారు. ఇక్కడ పని చేసిన తహశీల్దార్ వై ఎస్ .నాగరాజు గత నెల 30 న పదవి విరమణ చేసారు. దీనితో ప్రస్తుత పని చేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ ఇంఛార్జిగా వ్యవహరించారు.

# మోసపోయిన 'ముత్యాల..' మోసగించిన టి.డి.పి.

## రాజీనామాకు సిద్ధం



పెద్దాపురం : టిడిపి ఆవిర్భావం నుండి దివంగ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్‌తో కలిసి పనిచేశానని పార్టీ కొరకు జైలు జీవితం గడిపానని, ఆమరణ దీక్షలు చేశానని, స్వంత ఆస్తి రూ. 5 కోట్ల వరకు నష్టపోయానని నాకు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని నమ్మించి చంద్రబాబునాయుడు నన్ను మోసంచేసారని పెద్దాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యాల వీరభద్రరావు (రాజబ్బాయి) తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడుతూ యనమల రామ కృష్ణుడు, తదితరులు ఎమ్మెల్సీ ఇస్తామని నన్ను నమ్మించి తాత్కాలికంగా ఎఎంసి చైర్మన్‌గా ఉండమని కోరారని అయితే నేను తిరస్కరిస్తే స్వయంగా యనమల కలుగచేసుకొని ఆరు నెలలో మీకు ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చారని ఈ విషయం ముఖ్యమంత్రిగార్ని చెప్పమని కోరానని ఆయన కూడా హామీ ఇచ్చి, నమ్మించారని పార్టీ ప్రారంభం నుండి ఉన్నవారికి కంటే ప్రక్కపార్టీ వారికి ప్రత్యేక గౌరవించడం దురదృష్టకరమని ముత్యాల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పెద్దాపురం వ్యవసాయ శాఖలో నిధులు ఉన్నప్పటికీ సొంతభవనంలేదని గొడౌన్‌లకు స్థలం కేటాయించి వాటిన నిర్మిస్తే పండిన పంట నిల్వచేసేందుకు రైతుకు ఉపయోగపడుతుందని వేడుకున్నా టిడిపి న్యాయం చేయడంలేదని ముత్యాల తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. నమ్మద్రోహానికి అడ్డాగా మారిన టిడిపిలో కొనసాగడంపై కార్యకర్తలు తీవ్రంగా ఆగ్రహిస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి రాజీనామా చేయ్యవల సిందిగా వత్తిడి తెస్తున్నారని ముత్యాల తెలిపారు.

# ఘనంగా పి వి జయంతోత్సవాలు



కొత్తపల్లి : కొత్తపల్లి మండల కేంద్రమైన ఊర చెరువు సెంటర్లో ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద ఎఐసిసి సభ్యులు ఓలేటి రాయ భాస్కరరావు పి.వి. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు స్వీట్స్ పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో ఓలేటి మాట్లాడుతూ మంత్రిగా ముఖ్యమంత్రిగా కేంద్ర మంత్రిగా భారత ప్రధానిగా పనిచేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి పి.వి.నరసింహారావు మనదేశ ఆర్థిక వ్యవస్థ పునాదులను బలోపేతం చేయడానికి ఆయన తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు, 17 భాషలు తెలిసిన ఏకైక ప్రధాని ఆయనేనని కొనియాడారు. తన జీవితంలో ఏనాడు పదవి కోసం అధికారం కోసం ఆశించలేదన్నారు. తెలుగువారు భారత ప్రధాని కావడం తెలుగువారు చేసుకున్న అదృష్టమని ఓలేటి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓలేటి రాయి భాస్కరరావు కొప్పుల మధుసూదనరావు రంగనాయకులు దండా బాలయ్య త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా రత్నగిరిపై మహాచంద్రోత్సవము



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై ఏరువాక పౌర్ణమి సందర్భంగా రాష్ట్రంలో ఉన్న రైతులు అందరూ సస్యాభివృద్ధికిగాను మహా చంద్రోత్సవము గురువారం ఆయుష్యహోమ మండపము అనగా దర్బారు మండపము నందు ఉదయం 8-30ని.లకు విఘ్నేశ్వరుని పూజ, పుణ్యాహవచనంతో చంద్ర జప పారాయణ హోమము కార్యక్రమానికి ప్రధాన అర్చకులు గాడేపల్లి. వెంకట్రావు, అర్చకులు నాగాభట్ల .కామేశ్వరరావు, ముత్తు.సత్యనారాయణ తదిత రులు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎమ్.జితేంద్ర, ఏసి ఈరంకి. జగన్నాధరావు, ఏఈవో వైయస్ఆర్ మూర్తి, పిఆర్వో తులా. రాముడు, సూపరింటెండెంట్ బలువు.సత్య శ్రీనివాస్, టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి. లక్ష్మీ నారాయణ, సీసీ గణపతి, ట్రస్టీ కొత్త. కొండబాబు , గ్రామస్థులు, భక్తులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హోమ కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్ద ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో ఎమ్.జితేంద్ర మాట్లాడుతూ వర్ష రుతు ప్రారంభంలో జ్యేష్ఠశుద్ధ పూర్ణిమను ఏరువాక పున్నమిగా పిలుస్తారు అని ఏరు అంటే దున్నడానికి సిద్ధం చేసిన నాగలి అని, ఏరువాక అంటే దున్నడానికి ప్రారంభమని తెలిపారు. వేల సంవత్సరాల నుంచి ఏరువాక పున్నమిని పండుగలా కర్షకులు నిర్వహిస్తున్నారని, ఆ రోజు ఉదయాన్నే లేచి ఎద్దులను కడిగి చక్కగా అలంకరిస్తారని, వాటికి పొంగలి పెడుతారని,. అనంతరం రైతులందరూ సామూహికంగా ఎద్దు లను తోలుకుంటూ పొలాలకు వెళ్లి దుక్కి దున్ను తారని కావున రైతులు భాగుంటే దేశం బాగుం టుంది కావున రత్నగిరిపై రైతుల శ్రేయస్సు కొరకు ఈ మాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

## 8వ రోజుకు చేరిన రైస్‌మిల్లు కార్మికుల సమ్మె

# పోటీ కార్మికులను తీసుకువస్తే ప్రతిఘటిస్తాం

యానాం : నూతన వేతన ఒప్పందం అమలుచేయాలని కోరుతూ రైస్‌మిల్లు కార్మికులు ఇచ్చిన సమ్మె పిలుపు 8వ రోజుకు చేరుకొంది యానాం రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గాయత్రి మోడ్రన్ రైస్ మిల్లు, సుముఖ వీరేశ్వర రైస్‌మిల్లు కార్మికులు పలు ధపాలు పరిపాలనాధికారి కార్యాలయం, లేబర్ కార్యాలయంలో చేపట్టిన చర్చలు విఫలమవ్వడం, మంత్రి క్యాంపు కార్యాలయంలో పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు అధ్యక్షతన రైస్ మిల్లు యాజమాన్యం, కార్మికులమధ్య జరిగిన చర్చలు విఫల మవ్వడంతో ఈ నెల 21 నుండి కార్మికులు సమ్మె చేయడం మొదలైంది. అయితే పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి అందుబాటులో లేకపోవడంతో యాజమాన్యం కార్మికులతో సమ్మె జరుగుతున్నప్పటికీ చర్చలు జరపడం సాధ్యంకాలేదు. చర్చలలో ప్రధానంగా యాజమాన్యం మిల్లులు ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయని ఒక శాతం కూడా నూతనవేతనం ఒప్పందంకు ఒప్పుకోమని ఒకవేళ పెంచితే మిల్లులకు తాళ్ళాలువేసే పరిస్థితిలో ఉన్నాయని మంత్రి ఎదుట చెప్పటంతో కార్మికులు గత్యంతరం లేని పరిస్థితిలో సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం సమ్మె ప్రశాంతంగా జరుగుతుంటే ఈ సమ్మెను భగ్నంచేయడానికి యాజమాన్యం పోటీ కార్మికులను తీసుకువచ్చి పనులు చేయిస్తామని, మాకు రక్షణ కల్పించాలని పరిపాలనాధికారి దవులూరి సుబ్రమణ్యేశ్వరరావుకు, లేబర్ ఇన్‌స్పెక్టర్ మహేంద్రవర్మన్‌కు, సిఐ గిడ్ల సత్యనారాయణకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ విషయం తెలిసిన కార్మికులు ఇతర ప్రాంతాలనుండి పోటీ కార్మికులను తీసుకువస్తే ప్రతిఘటిస్తామని దీనికి అధికారులు, యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుంద న్నారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు మూసివేస్తామని యాజ మాన్యం ప్రకటించి నేటి పోటీ కార్మికులను ఎలా తీసుకువస్తారని ప్రశ్నిస్తున్నారు. కార్మికుల పొట్టకొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తే ఊరుకొనేదిలేదని కార్మికులు హెచ్చరించారు. జరుగుతున్న పరిణామాలపై సంబంధితులపై పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడీకి, ముఖ్యమంత్రి వి. నారాయణసామికి, ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావుకు, లేబర్ కమీషనర్‌కు, ఫిర్యాదు చేస్తామని యానాం రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. సమస్యను పరిష్కరించడానికి అధికారులు చొరవ చూపాలని లేనియెడలా ఆందోళన ఉదృతం చేస్తామని కార్మికులు తెలిపారు.

# ఇస్కాన్‌లో ఘనంగా జ్యేష్ఠాభిషేకాలు



విశాఖపట్నం : సాగర్‌నగర్ ఇస్కాన్ హరేకృష్ణ ల్యాండ్‌లో గల ఇస్కాన్ మందిరంలో వచ్చే నెల నిర్వహించనున్న శ్రీ జగన్నాథ రథయాత్ర సందర్భంగా సన్నిధిలో గల శ్రీ జగన్నాథ సుభద్ర బలభద్రులకు ఘనంగా జ్యేష్టాభిషేకాలు నిర్వహించారు. వైదిక ధర్మంలో భాగంగా సాంప్రదాయ రీతిలో ఇస్కాన్ ఆలయ అర్చకులు వేదమంత్రాలతో హరేకృష్ణ మహామంత్ర సంకీర్తన, మేళతాళాలతో అభిషేకాలు నిర్వహించగా ఈ జ్యేష్ఠాభిషేకంలో ఇస్కాన్ నగర శాఖ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయిసేవినిలతోపాటు భక్తులు కూడా పాల్గొని స్వయంగా అభిషేకంతోపాటు స్నానయాత్ర నిర్వహించారు. మాతాజి నితాయి సేవిని స్నానయాత్ర గురించి మాట్లాడుతూ పూరి జగన్నాథుని సన్నిధిలో నిర్వహించే రీతిలోనే ఇస్కాన్‌లో కూడా సంవత్సరానికి ఒక్కసారి భక్తులే స్వయంగా శ్రీ జగన్నాథునికి బలభద్రునికి సుభద్రాదేవికి అభిషేకం నిర్వహించే అదృష్టం భక్తులకు కలుగుతుందన్నారు. అభిషేకం జరిగిన మరుసటి రోజునుంచి 15 రోజులపాటు స్వామి వారి దర్శనం ఉండదని తెలియజేశారు. అభిషేకాలు జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించి తదుపరి దివ్యమూర్తులను సర్వాంగసుందరంగా అలంకరించి దూప, దీప నివేదన, నీరాజన మంత్రపుష్పములు సమర్పించారు. శ్రీ జగన్నాథస్వామి వారి యొక్క అవతార ప్రాముఖ్యతను సాంబదాస్ ప్రభూజీ మాతాజి నితాయి సేవిని భక్తులకు తెలిపారు. తదుపరి విచ్చేసిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఇస్కాన్ విశాఖ నగర శాఖ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ మాతాజి నితాయిసేవిని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సంస్థ పేరును ఎం.వి.రాజశేఖర్ అధిక సంఖ్యలో భక్తులు, ఇస్కాన్ సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్రభాను

## కాజల్‌కు భారీ ఆఫర్?



కాజల్ అగర్వాల్ కెరీర్ ప్రారంభించి పదేళ్లు పూర్తవుతున్నా ఆమె క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. చిరంజీవి నటించిన ఖైదీ నంబర్ 150 చిత్రంతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన ఈ ముంబై సోయగం వరుస భారీ ప్రాజెక్టలను సొంతం చేసుకుని తన స్టార్‌డమ్ ఏ మాత్రం తగ్గలేదని నిరూపించింది. ప్రస్తుతం బాలీవుడ్ హిట్ చిత్రం క్వీన్ ఆధారంగా తెరకెక్కుతున్న తమిళ చిత్రం పారిస్ పారిస్‌తో పాటు తెలుగులో బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా రూపొందుతున్న ఓ చిత్రంలో నటిస్తున్నది. ఇదిలా వుండగా ఆమె మరో భారీ ఆఫర్‌ను సొంతం చేసుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..వరుస క్రేజీ ప్రాజెక్టలతో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్న నిర్మాత డీవీవీ దానయ్య. త్వరలో ఆయన తన కుమారుడు కల్యాణ్‌ను హీరోగా పరిచయం చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. తేజ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ తుది దశకు చేరుకుంది. కాగా ఈ చిత్రంలో కల్యాణ్‌కు జోడీగా కాజల్ అగర్వాల్‌ని చిత్ర బృందం సంప్రదించారని, నిర్మాత దానయ్య ఆమెకు భారీగానే పారితోషికాన్ని ఆఫర్ చేసినట్లు సమాచారం. కాజల్ అగర్వాల్ ఈ ఆఫర్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది.

## ముహూర్తం కుదిరింది





బాహుబలిది కన్‌క్లూజన్ తర్వాత ఎన్టీఆర్, రామ్‌చరణ్ కథానాయకులుగా దర్శకుడు రాజమౌళి ఓ భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ఈ అగ్రకథానాయకులిద్దరూ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ చిత్రం ఎప్పుడు మొదలుకానుందా అని అభిమానులతో పాటు ఇండస్ట్రీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం నవంబర్‌లో ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకురానున్నట్లు తెలిసింది. తొలి షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో తెరకెక్కించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. నవంబర్ నుండి ఎన్టీఆర్, డిసెంబర్‌లో చరణ్ ఈ సినిమా చిత్రీకరణలో పాల్గొననున్నట్లు సమాచారం. ప్రస్తుతం రామ్‌చరణ్, ఎన్టీఆర్ తమ సినిమా చిత్రీకరణలతో బిజీగా ఉన్నారు. అవి పూర్తికాగానే ఈ మల్టీస్టారర్ షటింగ్‌ను మొదలుపెట్టనున్నట్లు తెలిసింది. దాదాపు 250 కోట్ల బడ్జెట్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్ పోలీస్ అధికారిగా, ఎన్టీఆర్ బాక్సర్ పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం కథానాయికల కోసం చిత్రబృందం అన్వేషణ సాగిస్తున్నారు. ఓ హీరోయిన్‌గా కీర్తిసురేష్‌ను ఎంపికచేసినట్లు తెలిసింది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో అంగన్వాడీల ఆకలి కేకలు

### దీక్ష చేస్తున్న వారికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

### హామీ నెరవేరకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన: ఏఐటియుసి



కొయ్యూరు: ఐసిడిఎస్ అధికారుల తీరుతో 14 నెలలుగా జీతాలు అందక అంగన్వాడీలు ఆకలి కేకలు పెడుతున్నారు. వీరి నిర్లక్ష్యంతో అంగన్వాడీలంతా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. గత మూడు రోజులుగా వీరు చేస్తున్న ఆందోళన గుర్తించిన ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి టెంట్ వద్దకు చేరి వేతనాలు పెంచారన్న ఆనందం లేకుండా అధికారులు చేయడం అన్యాయమన్నారు. దీక్ష వి ం వి ం వ జే శా ం. అధికారులతో మాట్లాడి 10 రోజుల్లో వేతనాలు అందేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మండలంలోని 85 మెయిన్, 75 మినీ అంగన్వాడీ కేంద్రాలున్నాయి. అనేక కుంటిసాకులు చెబుతూ స్థానికంగా ఉన్నతాధికారులు ఇలా చేయడం పట్ల అంగన్వాడీ ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

అత్యంత దయనీయం: ఐసిడిఎస్ అధికారుల తీరు అత్యంత దయనీయమని అంగన్వాడీ అసోసియేషన్ ఏఐటియుసి అనుబంధ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు అన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ చిన్మయిదేవి ఇచ్చిన హామీ నిలబెట్టుకోకపోతే అంగన్వాడీలకు మద్దతుగా మైదాన ప్రాంతంలో కూడా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## టీడీపీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేయాలి

భీమునిపట్నం టి.డి.పి. అభివృద్ధి కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని తగరపువలస జోన్ పట్టణ టీడీపీ అధ్యక్షులు కొప్పలరమేష్ అన్నారు. అందుకోసం విశాఖ టీడీపీ పార్టీ కార్యాలయంలోటీడీపీ బూత్ శిక్షణ తరగతులకు నాయకులతో కలిసి హాజరయి నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంత కష్టాన్నయిన ఇష్టం తో పని చేస్తే అది తప్పక విజయవంతమవుతుందని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు రవ్వవెంకటరావు, నాయకులు చిలకానర్సింగరావు,చంద్రమౌళి, తమ్మిన సూరిబాబు, తాటిపూడి అప్పలరాజు,నరవ రామారావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

### మంత్రిని కలిసిన నూతన ఎస్సీ కార్పొరేషన్ ఈడి బివి.రమణ

నర్సీపట్నం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సీ కార్పొరేషన్ ఈడి బివి.రమణ రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడును కలిశారు. ఈ సందర్భంగా అయ్యన్న భారీ పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.

## అభివృద్ధి పనుల్లో రాజీపడేది లేదు

### ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

కొయ్యూరు: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో రాజీపడేది లేదని సకాలంలో పూర్తయ్యేలా అధికారులంతా సహకరించాలని పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అభిప్రాయపడ్డారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆమె తొలుత చీడిపాలెం పంచాయతీ, శింగవరం, ఐటిడిఎ కాలనీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రమాదేవి, విఆర్‌ఒలతో కలిసి మాట్లాడారు. జీతాలు పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వెలుగు కార్యాలయంలో మండలంలోని 557 మంది సాధికారమిత్రలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి సంక్షేమ కార్యక్రమం వెనుక సాధికారమిత్రల ప్రమేయం ఉంటుందన్నారు. ప్రతీ కుటుంబానికి అందాల్సిన ప్రభుత్వ ఫలాలు మిత్ర ద్వారా అందుతాయని త్వరలో సాధికారమిత్రకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం మంప వెళ్లిన ఎమ్మెల్యే మంప నుండి వరేళ్ల వరకు నిర్మించిన రోడ్లను ప్రారంభించారు. తర్వాత రాత్రి మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో టిడిడి నేత ప్రసాద్, ఎంపిపి గొలిసింగి సత్యనారాయణ, జెడ్‌పిటిసి శ్రీరామ్మూర్తి, మండల పార్టీ అధ్యక్షులు కొర్రు రామమూర్తి, నేతల చిట్టిబాబు, లోతా భీమరాజు, అప్పన్న శ్రీరాములు, వై.వరహాలబాబు, ఎంపిడిఒ జానకి, ఈఒపిఆర్‌డి వరలక్ష్మి, హౌసింగ్ మల్లిఖార్జున్, ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ విశ్వతేజ, పిఆర్‌జెఇ బసవేశ్వరరావు, ఏటిడబ్ల్యూఒ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి అయ్యన్న

నాతవరం: నాతవరం మండలం మర్రిపాలెం గ్రామంలో గురువారం రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు.
మంగళవాద్యం లతో పొలమునకు తోడుకొనిపోయి భూమిని దుక్కి దున్ని ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ. రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలను టీడీపీ ప్రభుత్వం అందజేస్తుందన్నారు.
రైతులకు అవసరమైన యంత్రాలు సబ్సిడితో అందజేస్తుందన్నారు. జలసిరి పథకం ద్వారా కూడా రైతులకు అనేక లాభాలు చేకూరుస్తుందన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను కూడా ప్రభుత్వం ద్వారా అందజేస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా వర్షాలు బాగా పడి పంటలు బాగా పండి రైతులు ఆర్థికంగా ఎదగాలని కోరుకుంటున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో జేసి-2 అట్టాడ సిరి, నర్సీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి వి.విశ్వేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి, నర్సీపట్నం, నాతవరం ఎంపిపిలు సుకల రమణమ్మ, శింగంపల్లి సన్యాసిదేముడు, తహశీల్దార్ కనకారావు, వ్యవసాయవిస్తరణాధికారి మోహన్‌రావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏఎస్సైకు ఘన సన్మానం

కొయ్యూరు: అందరితో సౌమ్యంగా ఉంటూ అందరి మన్ననలు పొందిన వ్యక్తి మంప ఏఎస్సై సిహెచ్.విశ్వనాథపడాల్ అని సిఐ ఉదయ్‌కుమార్ కొనియాడారు. ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందుతున్న విశ్వనాథపడాల్‌ను కొయ్యూరు, మంప పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన ఘన సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విశ్వనాధ్‌పడాల్ శేషజీవితం కుటుంబంతో సుఖసంతోషాలతో గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో మంప ఎస్సై శ్రీనివాసరావు, కేడిపేట ఎస్సై రమేష్, ఎంపిపి జి.సత్యనారాయణ, జెడ్పీటీసీ శ్రీరామ్మూర్తి, మంప ఎంపిటిసి శివరామరాజు, సర్పంచ్ జర్తా రాజుబాబు, సిపిఐ నేత గోకిరి చిన్నారావు, సిపిఎం నేత ఎస్.సూరిబాబు, ఏఎస్సైలు రాజారావు, హెచ్‌సి కొండలరావు, కొయ్యూరు ఏఎస్సై అప్పారావు, మండల టిడిపి అధ్యక్షులు రామమూర్తి పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

గొలుగొండ: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని మండల తహశీల్దార్ పి.అంబేద్కర్ అన్నారు. గురువారం గాదంపాలెం పంచాయతీ విప్పలపాలెంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ, 22ఎ భూముల జాబితాలను అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో ఉంచడం జరిగిందన్నారు. వాటిలో ఎవరి సర్వేనెంబర్ అయినా నమోదై ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అటువంటి సర్వే నెంబర్ యొక్క భూపత్రాలను చూపించి సరి చేసుకోవాలన్నారు. ఎటువంటి భూసమస్యలనైనా తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే తగు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. అనంతరం గ్రామంలో ఉన్న పోలింగ్ బూత్‌ను ఆయన పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గోవిందరావు, విఆర్ఓ పడాల్, విప్పల పాలెం నీటి సంఘం చైర్మన్ లగుడు రామ్మూర్తినాయుడు, గ్రామ పెద్దలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## స్వచ్ఛసర్వేక్షన్ సహకరించిన వారందరికి కృతజ్ఞతలు

### మున్సిపల్ చైర్ పర్సన్ అనిత

నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీకి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు రావడానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని నర్సీపట్నం మున్సిపల్ చైర్ పర్సన్ చింతకాయల అనిత, వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీనికి సహకరించిన స్వచ్ఛంధ సంస్థలు, వాకర్స్‌క్లబ్, పత్రికా విలేకరులు, అధికారులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ మున్సిపాలిటీని అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్టోబర్ నాటికి అన్నాక్యాంటీన్ నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్, సిబ్బంది పాల్గొన్నారు.

## నెలాఖరు వరకు ఇంటర్మీడియేట్‌ల్లో ప్రవేశాలు

రోలుగుంట: ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు సంబంధించి ఈ నెలాఖరులోగా చేరవచ్చునని రోలుగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు 195 మంది విద్యార్థులు చేరారని ఆమె తెలిపారు. ఇక్కడ బైపిసి మినహా మిగతా గ్రూపుల్లో మాత్రమే ఖాళీలున్నాయని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుజాత కోరారు.







## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు



ముంబై: దేశాయస్టాక్‌మార్కెట్లు భారీ నష్టాల్లో ముగిశాయి. ఆరంభంనుంచి ఒడిదుడుకుల మధ్య కొనసాగినసూచీలు చివరకు నష్టాలతోనే ముగిశాయి. తీవ్ర అమ్మకాలతో ఒక దశలో సెన్సెక్స్ 270పాయింట్లు పైగా పతనమై 35 వేల దిగువకు చేరింది.

చివరకు సెన్సెక్స్ 179 పాయింట్లు క్షీణించి 35,028 వద్ద, నిఫ్టీ 82 పాయింట్లు నష్టపోయి 10589వద్ద స్థిరపడింది. తద్వారా నిఫ్టీ 10600 దిగువకు చేరింది. ఒక్క మెటల్ తప్ప దాదాపు అన్ని రంగాలూ వెనకడుగు వేశాయి. ప్రధానంగా రియల్టీ, బ్యాంక్ నిఫ్టీ, ఫార్మా, ఆయిల్‌సెక్టార్ నష్టాలు మార్కెట్లను నష్టాల్లోకి నెట్టాయి. ట్రేడ్‌వార్ భయాలు ప్రపంచ స్టాక్ మార్కెట్లను దెబ్బతీయడంతో దేశీయంగాను ప్రభావం చూపిందని ఎనలిస్టుల విశ్లేషణ. టెక్ మహీంద్ర 7శాతానికి పైగా నష్టపోగా, బీపీసీఎల్, పీఎన్‌బీ, అశోక్ లేలాండ్, ప్రెస్టేజ్, ఇండియాబుల్స్, డీఎల్‌ఎఫ్, శోభా, ఒబెరాయ్, హెచ్‌డీఐఎల్, బ్రిగేడ్, గోద్రెజ్ ప్రాపర్టీస్, యూనిటెక్, తదితరాలు నష్టాల్లో ముగిశాయి.

మరోవైపు మదర్సన్ సుమీ, టాటా స్టీల్ , ఎంఅండ్ఎం, గోద్రెజ్, నాల్కో, హిందాల్కో, భారత్ ఫోర్జ్, కంకార్, టొరంట్ పవర్, న్ఫోసిస్, గోద్రెజ్ సీపీ, టాటా పవర్ టాప్‌విన్నర్స్‌గా నిలిచాయి. అటు ఎంసీఎక్స్ మార్కెట్లో పుత్తడి 100 రూపాయిలు క్షీణించి 10 గ్రా. 30,595 వద్ద ఉంది.

## కాంగ్రెస్‌లోకి మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి?

### మంతనాలు జరిపిన ఎంపీ సుబ్బిరామిరెడ్డి



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని వస్తున్న వార్తలకు మరింత బలం చేకూరింది. కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ ఎంపీ టి.సుబ్బిరామి రెడ్డి హైదరాబాద్‌లోని కిరణ్ కుమార్‌రెడ్డి నివాసానికి వెళ్లి చర్చలు జరిపారు. మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు కూడా ఆయన ఇంటికి వెళ్లి చర్చించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కిరణ్‌కుమార్‌రెడ్డి మళ్లీ సొంత గూటికి చేరనున్నారని వస్తున్న ఊహాగానాలు నిజమయ్యేలా కనిపిస్తున్నాయి. సుబ్బిరామిరెడ్డి సైతం కిరణ్‌కుమార్‌రెడ్డిని తిరిగి పార్టీలోకి ఆహ్వానించడానికి వచ్చినట్లు విలేకరుతో చెప్పడం గమనార్హం.

ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం ఏపీలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తుడుచుపెట్టుకుపోయిన సంగతి తెలిసిందే. అయితే ఆనాడు యూపీఏ ప్రభుత్వం ఇచ్చిన విభజన హామీలను ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం తుంగలో తొక్కేయడంతో ప్రజల్లో భాజపాపై వ్యతిరేకత నెలకొంది. ముఖ్యంగా ప్రత్యేక హోదా అంశంలో కేంద్రంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని ఏపీలో తిరిగి పుంజుకోవాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. దీనికి సంబంధించి ముఖ్య నేతలకు ఏఐసీసీ నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. 2019లో తాము అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదాపైనే తొలి సంతకం చేస్తామని ఇటీవల ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ప్రకటించడమూ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం కలిగించింది.

ఈ క్రమంలోనే విభజన తర్వాత పార్టీకి దూరమైన నేతలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించి రాష్ట్రంలో పునర్వైభవం సాధించాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. తెలంగాణ ఉద్యమం సమయంలో ముఖ్యమంత్రిగా తన బాధ్యతలు సమర్థంగా నిర్వహించిన కిరణ్‌కుమార్‌రెడ్డిని తిరిగి పార్టీలో చేర్చుకుంటే శ్రేణుల్లో ఉత్సాహం నింపవచ్చని అధిష్ఠానం యోచిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయన తిరిగి సొంత గూటికి చేరేలా ముఖ్యనేతలు మంతనాలు సాగిస్తున్నారు.

## ధోనీ నుంచి నేను చాలా నేర్చుకున్నా

### పాక్ కెప్టెన్ సర్ఫరాజ్



కరాచి: కెప్టెనగా, ఆటగాడిగా భారత క్రికెట్ జట్టు మాజీ సారథి మహంద్రసింగ్ ధోనీ నుంచి ఎంతో స్ఫూర్తి పొందినట్లు తెలిపాడు పాకిస్థాన్ క్రికెట్ జట్టు సారథి సర్ఫరాజ్ అహ్మద్. జింబాబ్వే పర్యటనకు వెళ్లే ముందు సర్ఫరాజ్ మీడియాతో మాట్లాడాడు. భారత ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీని చూసి చాలా స్ఫూర్తి పొందా. గతంలో అతడు భారత టెస్టు, వన్డే, టీ20 క్రికెట్ జట్లకు నాయకుడిగా ముందుండి నడిపించాడు. అన్ని ఫార్మాట్లలో ఒకరే కెప్టెన్సీ బాధ్యత వహించడం సవాలుతో కూడుకున్నది. ఈ విషయంలో ధోనీ నుంచి నేను చాలా నేర్చుకున్నా అని చెప్పాడు సర్ఫరాజ్. ఇప్పటి వరకు ధోనీని ఒక్కసారి మాత్రమే కలిశాను. అది కూడా గతేడాది ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా జూన్ 4న భారత్-పాకిస్థాన్ మ్యాచ్ సమయంలో. ఒక ఆటగాడిగా, కెప్టెన్‌గా అతన్ని చూసి నేర్చుకోవల్సింది చాలా ఉంది. భారత్‌కు గొప్ప గొప్ప విజయాలు అందించిన ధోనీ ఎంతో నిరాడంబరంగా ఉంటాడు. అతని చూసి మొదట నేను ఆశ్చర్యపోయాను. ఆ తర్వాత అతన్ని ఒకసారి కలిసి మాట్లాడాను అని సర్ఫరాజ్ తెలిపాడు. జింబాబ్వే-పాకిస్థాన్-ఆస్ట్రేలియా మధ్య ముక్కోణపు టీ20 సిరీస్ జరగనుంది. భారత్-ఐర్లాండ్ మధ్య శుక్రవారం రెండో టీ20 జరగనుంది. అనంతరం జులై 3 నుంచి భారత్-ఇంగ్లాండ్ మధ్య టీ20 సిరీస్ ప్రారంభంకానుంది.

## ఏపీకి అన్యాయం చేస్తే ఊరుకోం

గుంటూరు: ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేస్తే తమ తల్లికి తామే అన్యాయం చేసినట్లు అవుతుందని బీజేపీ జాతీయ మహిళా మోర్చా కన్వీనర్ దగ్గబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. గురువారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి విషయంలో తమ పార్టీ వివక్ష చూపటంలేదని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు, కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణాలకు బీజేపీ సానుకూలంగా ఉందని తెలిపారు. ఏపీకి అన్యాయం జరిగితే తాము ఎందుకు చూస్తూ ఊరుకుంటామని ప్రశ్నించారు.



టీడీపీ నేతలు కావాలనే బీజేపీపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని వారిని నమ్మవద్దని పురందేశ్వరి ప్రజలకు సూచించారు.

### టీడీపీ ఎంపీ రమేష్ దీక్షపై

## ఎమ్మెల్యే రోజా ఛలోక్తులు



హైదరాబాద్: టీడీపీ ఎంపీ సీఎం రమేష్ దీక్షపై వైసీపీ ఎమ్మెల్యే రోజా సెటైర్లు వేశారు. గత నాలుగేళ్ల పాలనలో గుర్తుకురాని స్టీల్ ప్లాంట్ ఇప్పుడు గుర్తుకువచ్చిందా అని ఆమె విమర్శించారు. వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రోజా మాట్లాడారు. సీఎం రమేష్ స్టీల్ ప్లాంట్ కోసం కాదని, తన డైట్ కోసం దీక్ష చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కడప ఉక్కు సాధన కోసం సీఎం రమేష్ దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే.

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750

## ప్రాచీన సాంప్రదాయాలను భావితరాలకు చాటిచెప్పండి

### ఆంధ్ర రాష్ట్రాన్ని అన్నపూర్ణగా భారతదేశంలోనే మొదటి స్థానంలో నిలపాలి

### జెడ్.పి. ఛైర్‌పర్సన్ లాలం భవాని



విశాఖపట్నంః మన తెలుగు రాష్ట్ర సాంప్రదాయాల ప్రకారం ప్రాచీన కాలం నుండి రైతులు తొలకరి వచ్చి వర్షాలు ప్రారంభమయ్యే సమయంలో సాంప్రదాయకంగా నాగళ్ళకు ఎడ్లను కట్టి పూజలు చేసి వ్యవసాయ భూములకు మొక్కి దుక్కి దున్ని విత్తనాలు చల్లుకునే కార్యక్రమమే ఏరువాక అని, ఈ సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలం భవాని అన్నారు. గురువారం భీమిలి నియోజకవర్గం పరిధిలో గల పద్మనాభం మండలం అనంతవరం గ్రామంలో జరిగిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముందుగా పొలంలో నాగళ్లకు, ఎడ్లకు ఆమె పూజ నిర్వహించి నవధాన్యాలను జల్లి ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాల నుండి ఏరువాక పౌర్ణమిని ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతోందని, అన్నారు. వ్యవసాయ కుటుంబానకి చెందిన తాను ఈ పండగను ప్రారంభించడం తనకెంతో ఆనందంగా ఉందని ఆమె అన్నారు. నైరుతీ రుతుపవనాల కోసం రైతులు ఎదురు చూసే సమయం ఆసన్నమైందని, అన్నదాతలకు ఇది పండగ అని, వాతావరణంలో జరుగుతున్న పలు మార్పులు కారణంగా చాలా తేడాలు వస్తున్న సంగతి విదితమేనని, అందుకు అనుగుణంగా పంటలు పండించుకోవడం చాలా అవసరమని ఈ విషయమై శాస్త్రవేత్తల సూచనలు తీసుకోవడం చాలా అవసరమని అన్నారు. భూసార పరీక్షలు చేయించుకుని పంటలను వేయాలని ఆమె అన్నారు. ప్రభుత్వం పాడి పశువుల కొనుగోలుకు, దాణా అందజేతకు రుణం మంజూరు చేస్తోందన్నారు. నీటి సమస్య లేకుండా పలు నదులను అనుసంధానం చేస్తోందన్నారు. వర్షపు నీరు వృధా కాకుండా ఫాం పాడ్‌లను, ఇంకుడు గుంటలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆత్మ పి.డి. అప్పలస్వామి మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకునేందుకు వీలుగా రైతులకు భూసార ఆరోగ్య కార్డులు రైతులకు అందజేయడం జరుగుతోందన్నారు. సమగ్ర సూక్ష్మ పోషక యాజమాన్య పథకంకింద రైతులకు ఎరువుల పంపిణీని అందించడం అవరమైన మేరకు రుణాల పంపిణీ జరుగుతోందన్నారు. ఏరువాక పూర్ణిమలో భాగంగా పలు శాఖలలో ఉత్తమ రైతులుగా ఎంపికైన వారికి మెమెంటోలను అందజేసి సత్కరించారు. ఏరువాక పూర్ణిమలో భాగంగా వ్యవసాయం, పట్టు పరిశ్రమ, మత్స్య, ఉద్యాన, పశుసంవర్థక, సూక్ష్మ సాగు నీటి పథకంలకు చెందిన శాఖలకు సంబంధించిన వివరాలను రైతులకు తెలియజేసే విదంగా ప్రదర్శన స్టాళ్ళను ఏర్పాటు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జి. పెద ఎర్రినాయుడు, ఏపి గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బి. మణిశంకర నాయుడు, ఎంపీపీ కాళ్ల పద్మ, జెడ్‌పిటిసి కసిరెడ్డి దామోదరరావు, వ్యవసాయం, పశు సంవర్థకం, మత్స్య, ఉద్యానవన శాఖ, మార్కెటింగ్, పట్టు పరిశ్రమ, సూక్ష్మ సాగునీటి శాఖల అధికారులు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి జవహర్‌లాల్ నెహ్రూ, మండల ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు, ఎంపిడిఓ, తహశీల్దార్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిత "అమర్" రహా

- అనుమతులు లేకుండా పాఠశాల నిర్వాహణ
- అధికార పార్టీ అండదండలు
- చర్యలు తీసుకోలేకపోతున్నామంటున్న విద్యాశాఖాధికారులు

అనకాపల్లిః ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహితమవుతున్న అమర్ పాఠశాల విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుతుంది. ఈ పాఠశాల యాజమాన్యానికి అధికార పార్టీ అండదండలు ఉన్న కారణంగా విద్యాశాఖాధికారులు కూడా ఎలాంటి చర్యలు చేపట్టలేకపోతున్నారు. పట్టణంలో నర్సింగరావుపేటలోగల అమర్ స్కూలుకు కనీసం ప్రాథమిక అర్హతలు కూడ లేవు. అయినా రెండేళ్ల నుంచి పాఠశాలను ఎలాంటి భయం లేకుండా, నడుపుతున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు నియమ నిబంధనలపై అవగాహన లేకపోవడం వలన ఆ పాఠశాలలో చదివిస్తున్న భవిష్యత్‌లో తమ పిల్లల జీవితాల గురించి భయపడక తప్పదనే చెప్పుకోవాలి. ముఖ్యంగా ఆలోచిస్తే ఈ పాఠశాల అగ్ని ప్రమాదానిక గురైతే ఒక్క విద్యార్థి కూడా తప్పించుకోలేడు. ఆకరుకు ఫైర్ ఇంజన్ వెళ్లి మంటలు ఆర్పే, అవకాశం కూడా ఉండదు.

పాఠశాలకు అనుమతులు మంజూరు చేసే సమయంలో స్కూలు భవనం దిగువన ఒక ఫైరింజన్ చుట్టూ తిరిగే స్థలం ఉందా లేదా అన్నది చూసి అనుమతులు మంజూరు చేయాలి, కాని ఈ పాఠశాల విషయంలో అగ్నిమాపక శాఖాధికారులు అవేమి పట్టించుకోకుండానే అనుమతులు ఇచ్చినట్లుగానే తెలుస్తుంది. అలాగే బోధన సిబ్బంది కూడా, అనుభవం లేనివారు, అంతగా చదువుకోని వారు ఉన్నట్టు బొగట్టా.

అలాగని అక్కడ ఫీజులు తక్కువేమి కాదు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా డబ్బులు గుంజుతున్నారు. విద్యాశాఖ అనుమతులు లేని, పాఠశాలకు పెద్ద మొత్తంలో ఫీజులు గుంజుతున్న అమర్ యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేయడం పట్ల, సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే అనుమతులు లేవని తెలిసి కూడా, పాఠశాలపై ఎలాంటి చర్యలు తీసుకోని విద్యాశాఖ అధికారులపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెంటనే అమర్ పాఠశాలను సీజ్ చేసి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

### డీఈవో వివరణ

దీనిపై డీఈవో బి. లింగేశ్వరరెడ్డిని వివరణ కోరగా అమర్ పాఠశాలకు అనుమతులు లేవనేది వాస్తవమని చెప్పారు. పాఠశాలను వెంటనే సీజ్ చేస్తామని తెలిపారు. ఇదే విషయమై అమర్ యాజమాన్య ప్రతినిధులను సంప్రదించగా, నిర్లక్ష్యపు సమాధానంతో తోసిపుచ్చారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com